
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
5
చిత్తూరు జిల్లా వార్తలు
బుధవారం 1 మే 2024





● జనాల్లోకి సూపర్‌సిక్స్ సక్సెస్..



టీడీపీ ఇప్పటికే సూపర్‌సిక్స్ పేరుతో కొన్ని పథకాలను ప్రకటించగా అవి ప్రజల్లోకి వెళ్లిపోయాయి. అందులోని యువతకు 20 లక్షల ఉద్యోగాలు-నెలకు రూ.3 వేల నిరుద్యోగ భృతి, స్కూలుకు వెళ్లే ప్రతి విద్యార్థికీ అమ్మకు వందనం కింద ఏడాదికి రూ.10వేల సాయం, అన్నదాత కింద ప్రతి రైతుకూ ఏడాదికి రూ.20 వేల ఆర్థిక సాయం, 19-59 ఏళ్ల వయసున్న ప్రతి మహిళకూ నెలకు రూ.1,500 అందజేత, ప్రతి ఇంటికీ ఏడాదికి ఉచితంగా మూడు గ్యాస్ సిలిండర్లు, మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం. ఇవన్నీ జిల్లా ఓటర్ల మీద తీవ్ర ప్రభావం చూపించనున్నాయి. ఆరు అంశాల్లోనూ లబ్ధిదారులు పెద్దయెత్తున ఉన్నారు. ఈ మధ్య వైసీపీ విడుదల చేసిన మేనిఫెస్టో కంటే ఈ సూపర్‌సిక్స్ పథకాలే బాగున్నాయని జిల్లా ప్రజలు లెక్కలేసుకుంటున్నారు.

● టీడీపీ వస్తే 50 ఏళ్లకే పెన్షన్




సామాజిక పెన్షన్ల విషయంలో వైసీపీకి దెబ్బ పడే అవకాశం ఉంది. టీడీపీ ఈ ఏప్రిల్ నుంచే రూ.4 వేల పెన్షన్ అందిస్తానంటోంది. వైసీపీ మాత్రం 2029 ఎన్నికల నాటికి రూ.3,500 అందిస్తానని మేనిఫెస్టోలో పేర్కొంది. వికలాంగులకు రూ.6 వేల పెన్షన్ అని టీడీపీ చెప్తే వైసీపీ ఆ ప్రస్తావన తేలేదు. ఇదంతా పక్కనపెడితే బీసీలకు, ముస్లింలకు 50 ఏళ్లకే సామాజిక పెన్షన్ అందిస్తామని టీడీపీ తాజా మేనిఫెస్టోలో చెప్పింది. జిల్లాలో 2.74 లక్షల మంది పెన్షనర్లలో 75శాతం బీసీ, ముస్లింలే లబ్ధిదారులుగా ఉన్నారు.

● మహిళా సంఘాలకు రూ.10 లక్షల రుణాలు



డ్వాక్రా సంఘాల మహిళలకు రూ.3 లక్షల వరకే వడ్డీ లేని రుణాలు అందిస్తానని వైసీపీ ప్రకటించగా.. టీడీపీ దాన్ని రూ.10 లక్షలకు పెంచుతూ నిర్ణయం తీసుకుంది. జిల్లాలో 29,300 సంఘాల్లో 2,70,197 లక్షల మంది మహిళలకు ఉపయోగపడుతుంది.



అన్నివర్గాలకూ మేలు చేసేలా..

● టీడీపీ వర్గాల్లో రెట్టించిన ఉత్సాహం

ప్రజాగళం ఉమ్మడి మేనిఫెస్టో

● విజయంపై అభ్యర్థులకు బలపడిన నమ్మకం

● ఇప్పటికే వైసీపీ మేనిఫెస్టోతో ఆ పార్టీ శ్రేణుల డీలా

చిత్తూరు, ఏప్రిల్ 30 (ఆంధ్రజ్యోతి): సమాజంలో అధిక సంఖ్యలో ఉన్న రైతులకు, పెన్షనర్లకు, మహిళలకు ఏ మాత్రం ఉపయోగపడని జగన్ మేనిఫెస్టోతో ఇప్పటికే వైసీపీ శ్రేణుల్లో తీవ్ర నిరాశ నెలకొంది. ఈ క్రమంలో అన్ని వర్గాల వారికీ మేలు చేసేలా టీడీపీ కూటమి ఉమ్మడి మేనిఫెస్టోను మంగళవారం విడుదల చేసింది. ప్రభుత్వంపై వ్యతిరేకత, టీడీపీకి లభిస్తున్న ఆదరణ, ఏ ఒక్కరికీ మేలు చేయని జగన్ మేనిఫెస్టోతో ఇప్పటికే టీడీపీ శ్రేణులకు గెలుపుపై నమ్మకం పెరిగింది. ఉమ్మడి మేనిఫెస్టోతో అది మరింత బలపడింది. తమ గెలుపులో ఈ మేనిఫెస్టో కీలక పాత్ర పోషిస్తుందని జిల్లాలోని కూటమి అభ్యర్థులు ఆశిస్తున్నారు.

● వలంటీర్లకు రూ.10 వేల జీతం



టీడీపీ వస్తే వలంటీర్ల వ్యవస్థను రద్దు చేస్తుందని వైసీపీ ప్రచారం చేస్తున్న నేపథ్యంలో కొనసాగిస్తామని ఇప్పటికే చంద్రబాబు పలుమార్లు ప్రకటించారు. జిల్లాలోని 612 గ్రామ, వార్డు సచివాలయ పరిధిలో 8 వేల మందికిపైగా వలంటీర్లు పనిచేస్తున్నారు. వైసీపీ ప్రచారంలో పాల్గొనేందుకు సుమారు 2 వేల మంది రాజీనామా చేసి స్వామిభక్తి చాటుకుంటుండగా, మిగిలిన 6 వేల మంది అలాగే కొనసాగుతున్నారు. వారందరి జీతం రూ.10 వేలకు పెరగనుంది.

● ఉద్యోగుల గౌరవానికి టీడీపీ హామీ



వైసీపీ ప్రభుత్వం ఈ ఐదేళ్ల పాటు ఉద్యోగ, ఉపాధ్యాయులను పురుగుల్లా చూపి అనేక రకాలుగా వేధించిన విషయం తెలిసిందే. ఈ క్రమంలో టీడీపీ వస్తే ఉద్యోగులకు మెరుగైన పీఆర్సీ ప్రకటించి, వారి గౌరవాన్ని పునఃప్రతిష్ఠింపజేస్తామని మేనిఫెస్టోలో పేర్కొంది. ఒకటో తేదీన జీతం పడక ఉద్యోగులు, పెన్షనర్లు బ్యాంకుల దృష్టిలో డీఫాల్టర్లుగా మారిన సందర్భాలున్నాయి. టీడీపీ వస్తే ఒకటో తేదీన కచ్చితంగా జీతాలు, పెన్షన్లు ఇస్తామని ప్రకటించింది. జిల్లాలో 27,200 మంది ఉద్యోగులు, 12,505 మంది పెన్షనర్లు ఇప్పటికే ప్రభుత్వానికి వ్యతిరేకంగా ఉండగా, టీడీపీ మేనిఫెస్టోతో వారిలో మరింత నమ్మకం కుదిరింది.

● అంగన్వాడీలకు టీడీపీ భరోసా



టీడీపీ ప్రభుత్వం అంగన్వాడీల జీతాన్ని రూ.6 వేల నుంచి రూ.10,500కు పెంచింది. వైసీపీ వచ్చాక రూ.వెయ్యి పెంచి దాన్ని రూ.11,500 చేసింది. వారికి ఇచ్చిన అనేక హామీలను అమలు చేయలేదు. టీడీపీ ప్రభుత్వం వారికి గ్రాట్యుటీ చెల్లిస్తానని మేనిఫెస్టోలో పేర్కొనగా.. వైసీపీ వారి గురించి ప్రస్తావించలేదు. జిల్లాలోని 2,420 మంది అంగన్వాడీలకు మేలు కలగనుంది.

● పేదలకు 3 సెంట్ల స్థలం



వైసీపీ ప్రభుత్వం గ్రామాల్లో ఒకటిన్నర సెంటు, పట్టణాల్లో ఒక సెంటు స్థలాన్ని పేదలకు కేటాయించింది. ఈ ఐదేళ్లలో జిల్లాలోని 74 వేల మందికి ఇలా పట్టాలను ఇచ్చింది. అవన్నీ ఊరికి దూరంగా కొండల్లో గుట్టల్లో కేటాయించడంతో నిర్మాణాలకు లబ్ధిదారులు ముందుకు రాలేదు. టీడీపీ దానికి రెట్టింపుగా గ్రామాల్లో మూడు, పట్టణాల్లో రెండు సెంట్ల స్థలాన్ని కేటాయిస్తామని ప్రకటించింది. ఇప్పటికే స్థలం మంజూరై ఉంటే ఆ ప్రాంతంలో ఇళ్ల నిర్మాణాలను పూర్తి చేస్తామని తెలిపింది.

● టీడీపీ వస్తేనే ఉచిత ఇసుక విధానం



వైసీపీ ప్రభుత్వం వచ్చాక ఇసుక లభ్యత లేకుండా పోయింది. జిల్లాలో జేపీ వెంచర్స్ సంస్థ తరఫున ఎంపిక చేసిన రీచుల్లో అమ్మకాలు సాగించారు. కానీ నదుల్లో ఎక్కడా ఇసుక లేకుండా వైసీపీ నాయకులు దోచుకున్నారు. ప్రాంతాన్ని బట్టి ట్రాక్టరు ఇసుక ధర జిల్లాలో రూ.3 వేల నుంచి రూ.5 వేల వరకు ఉంది. దీంతో నిర్మాణ రంగం డీలా పడింది. టీడీపీ వస్తే ఇసుకను ఉచితంగా అందిస్తామని ప్రకటించింది. దీంతో ఇళ్ల నిర్మాణ లబ్ధిదారులతోపాటు నిర్మాణ రంగ కార్మికులకు మేలు కలుగుతుంది.

రామచంద్రయాదవ్‌తో పాటు 13 మందిపై హత్యాయత్నం కేసు

సదుం ఘటనలో పోలీసులే ఫిర్యాదుదారులు - బీసీవైపీలో 22 మంది, వైసీపీలో 10 మందిపై కేసులు

పుంగనూరు, ఏప్రిల్ 30: సదుం మండలం ఎర్రాతివారిపల్లెలో సోమవారం జరిగిన ఘర్షణకు సంబంధించి 13మందిపై హత్యాయత్నం కేసు నమోదు చేశారు. ఈ ఘటనపై ఎవరూ ఫిర్యాదు ఇవ్వకపోవడంతో పోలీసులే ఫిర్యాదుదారులయ్యారు. వారు ఇచ్చిన ఫిర్యాదు మేరకు నాలుగు సెక్షన్ల కింద కేసులు నమోదయ్యాయి. బీసీవైపీ అభ్యర్థి రామచంద్రయాదవ్‌తోపాటు ఆ పార్టీకి చెందిన 21మంది, ఐదుగురు వైసీపీ కార్యకర్తలపై రెండు హత్యాయత్నం, మరో రెండు వివిధ సెక్షన్లలో కేసులు పెట్టారు. బీసీవై పార్టీ ప్రచారంలో భాగంగా సోమవారం ఎర్రాతివారిపల్లె, కల్లూరు రోడ్డు ఆర్చి వద్ద, సదుం పోలీసుస్టేషన్ వద్ద వైసీపీ నేతలు రాళ్లు, కర్రల దాడులు, ప్రచార రథం దహనం, పలు వాహనాల ధ్వంసం చేసిన ఘటనలో పలువురు గాయపడిన విషయం తెలిసిందే. ఎర్రాతివారిపల్లెలో ప్రచారం చేయడానికి అనుమతిలేకపోయినా బీసీవైపీ నేతలు రావడంపై తాము అడ్డుకున్నామని, రామచంద్రయాదవ్ మైకులో మాట్లాడుతూ అనుమతి అవసరంలేదంటూ రెచ్చగొట్టారని, పైగా వైసీపీ కార్యకర్త వేణురెడ్డిని, సర్పంచ్ మనోహర్, ఇందిరమ్మలను కొట్టిగొడవ చేశారని, అంతేగాక తమ విధులకు ఆటంకం కలిగించారని సదుం ఎస్‌ఐ ఇ.మారుతి ఫిర్యాదు చేశారు. రాళ్లదాడిలో ఎస్‌ఐ కాలికి గాయమైందన్నారు. ఈ కేసులో బీసీవైపీకి చెందిన రామచంద్రయాదవ్, ఆనందరెడ్డి, రమేశ్‌యాదవ్, అనిల్‌కుమార్‌రెడ్డి, సుబ్రహ్మణ్యంరెడ్డి, హరినాథరెడ్డి, భరత్‌కుమార్, పరదేశి, వెంకటేశ్, ఓంప్రకాశ్, శివకుమార్, విశ్వనాథ్, లోకనాథంపై హత్యాయత్నం కేసు నమోదు చేశారు. అలాగే ఎర్రాతివారిపల్లెకు అనుమతిలేదని, వెళ్లరాదని చెప్పినా వినకుండా బీసీవై పార్టీ శ్రేణులు రాయితో కొట్టి విధులకు అడ్డుతగిలారని సదుం హెడ్ కానిస్టేబుల్ జి.చంద్రశేఖర్ ఇచ్చిన ఫిర్యాదుపై రామచంద్రయాదవ్, భరత్‌కుమార్, ఆనందరెడ్డి, పరదేశి, వెంకటేశ్, ఓంప్రకాశ్, శివకుమార్, కైఫ్, ప్రసాద్ తదితరులపై కేసు నమోదు చేశారు.

వైసీపీ కార్యకర్తలపై కేసులు

ఎర్రాతివారిపల్లెకు అనుమతిలేకుండా ఎందుకు వస్తున్నారని వైసీపీ కార్యకర్తలు అడ్డుకోగా రామచంద్రయాదవ్ బూతులు తిట్టి రెచ్చగొట్టడంతో వైసీపీ శ్రేణులు రాజన్న, ఆవులమణి, వెంకటరమణ, గురుమూర్తి, మనోహర్ మరికొందరు రాళ్లు, కర్రలతో వాహనాలు ధ్వంసం చేసి, పలువురిని గాయపరిచారని ఏఎస్‌ఐ షామీర్ ఫిర్యాదు చేశారు. దాడిలో భరత్‌కుమార్, ఆనందరెడ్డి, ఓంప్రకాశ్, దుర్గ, స్వాతి గాయపడ్డారని తెలిపారు. బీసీవైపీ వారిని చంపాలని కేకలు వేస్తూ వాహనాలపై దాడులు చేస్తూ వెంబడించినట్లు పోలీసులు కేసులు నమోదు చేశారు. గ్రామంలోకి దౌర్జన్యంగా వచ్చి అడ్డువచ్చిన వేణురెడ్డిపై దాడిచేయడంతో ఇరువర్గాలు రాళ్లు, కర్రలతో దాడులకు పాల్పడినట్లు ఎస్‌ఐ మారుతి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు. పోలీస్‌స్టేషన్ ఎదుట రోడ్డుపై ఉన్న బీసీవైపీ ప్రచార రథానికి నిప్పుపెట్టడం, వాహనాలు ధ్వంసం చేసి, రాళ్ల దాడులకు పాల్పడిన వైసీపీ కార్యకర్తలు హరి, వంశీ, గురుమూర్తి, జావీద్, రమేశ్‌లపై హత్యాయత్నం కేసు నమోదు చేశారు. కాగా సదుం విధ్వంసంపై అనంతపురం డీఐజీ అమ్మిరెడ్డి, చిత్తూరు ఎస్పీ మణికంఠ, పలమనేరు డీఎస్పీ మహేశ్వరరెడ్డి సమీక్షించారు.

ఇల్లు దగ్ధం గురించి పట్టించుకోని డీఐజీ :

సదుం మండలం చిలకపాటివారిపల్లెలో బీసీవైపీ నాయకుడు ఆనందరెడ్డి ఇంటికి తాళాలు వేసి పెట్రోల్ పోసి వైసీపీ మూకలు నిప్పు పెట్టాయి. ఇంటిలోని కారును ధ్వంసం చేసి, యాక్టివా స్కూటర్‌ను కాల్చివేసి బీభత్సం సృష్టించినా దాని గురించి డీఐజీ అమ్మిరెడ్డి పట్టించుకోకపోవడం విమర్శలకు తావిచ్చింది.

ఆస్పత్రికి తీసుకెళ్లిన బీసీవైపీ శ్రేణులు ఎక్కడ..?

సదుం విధ్వంసంలో గాయపడిన బీసీవై పార్టీ నేతలు 12మందిని పుంగనూరు పోలీసులు వైద్యం కోసం సోమవారం రాత్రి తీసుకెళ్లగా మంగళవారం రాత్రి వరకు తిరిగి రాలేదు. దీనిపై వారి కుటుంబ సభ్యులు ఆందోళన చెందుతున్నారు. వాహనాలను వైసీపీ మూకలు ధ్వంసం చేయడంతో పోలీసులు వారి వాహనాల్లో సదుం పోలీస్‌స్టేషన్ నుంచి రామచంద్రయాదవ్, వారి అనుచరులను పుంగనూరులో ఇంటికి చేర్చారు. రాత్రి 11 గంటల ప్రాంతంలో వైసీపీ దాడిలో గాయపడిన బీసీవైపీ నాయకులు వెంకటేశ్, వేణుగోపాల్‌రెడ్డి, అనీల్‌కుమార్‌రెడ్డి, శివతో కలిపి 12మందిని సీఐ రాఘవరెడ్డి, ఎస్‌ఐ మహ్మద్ రఫీ పుంగనూరు ప్రభుత్వాస్పత్రికి తీసుకెళ్లారు. ప్రథమ చికిత్స అనంతరం వారిని పోలీసులు బలవంతంగా ఎక్కడికో తీసుకెళ్లారని కుటుంబ సభ్యులు ఆరోపిస్తున్నారు. ఫోన్లు స్విచ్‌ఆఫ్ వస్తోందన్నారు.

డీఐజీ అమ్మిరెడ్డి పరిశీలన

సదుం, ఏప్రిల్ 30: సదుం ఘటనపై అనంతపురం రేంజ్ డీఐజీ అమ్మిరెడ్డి, ఎస్పీ మణికంఠ సునిశితంగా పరిశీలిస్తున్నారు. సోమవారం రాత్రి నుంచి సిబ్బందితో సమీక్షలు, విచారణలు, వీడియో ఫుటేజీలను పరిశీలించారు. మంగళవారం ఉదయం దాడి జరిగిన ప్రాంతాలను పరిశీలించారు. సిబ్బందితో సమీక్షించారు. కాగా బీసీవై పార్టీ వాహనంపై దాడిలో పలువురు అనుమానితులు పోలీసుల అదుపులో ఉన్నట్లు, డీఐజీ ఆదేశాల మేరకు వారిని అరెస్టు చేసి, జడ్జి ముందు హాజరుపరచనున్నట్లు ఎస్‌ఐ మారుతి తెలిపారు.



సదుం పోలీసు స్టేషన్‌కు వచ్చిన డీఐజీ అమ్మిరెడ్డి

మాజీ సీఎం కిరణ్‌కు హైకోర్టులో ఊరట

రొంపిచెర్ల కేసులో తదుపరి చర్యలు నిలుపుదల

అమరావతి, ఏప్రిల్ 30(ఆంధ్రజ్యోతి): మాజీ ముఖ్యమంత్రి, రాజంపేట లోక్‌సభ బీజేపీ అభ్యర్థి నల్లారి కిరణ్‌కుమార్‌రెడ్డికి హైకోర్టులో ఊరట లభించింది. రొంపిచర్ల పోలీసులు నమోదు చేసిన కేసులో తదుపరి చర్యలన్నింటినీ నిలుపుదల చేస్తూ హైకోర్టు మధ్యంతర ఉత్తర్వులు జారీ చేసింది. తదుపరి విచారణను జూన్ నెలకు వాయిదా వేస్తూ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ కె.శ్రీనివాసరెడ్డి మంగళవారం ఆదేశాలిచ్చారు. ఎన్నికల అధికారి నుంచి ముందస్తు అనుమతి లేకుండా రొంపిచర్ల బస్టాండ్ ప్రాంతంలో సమావేశం నిర్వహించారని ఎంపీడీవో రెడ్డెప్ప ఆచార్య ఇచ్చిన ఫిర్యాదు ఆధారంగా పోలీసులు నమోదు చేసిన కేసును కొట్టివేయాలని కోరుతూ కిరణ్‌కుమార్‌రెడ్డి హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. పిటిషనర్ తరఫున న్యాయవాది ఎన్‌వీ సుమంత్ వాదనలు వినిపించారు. సభలు, సమావేశాలు నిర్వహించుకొనేందుకు ఎన్నికల అధికారి నుంచి ముందస్తుగా అనుమతి తీసుకోవాల్సి ఉందన్నారు. నిబంధనలు ఉల్లంఘిస్తే సంబంధిత ఎన్నికల అధికారే ఫిర్యాదు చేయాలన్నారు. ప్రస్తుత కేసులో ఎన్నికలతో సంబంధంలేని ఎంపీడీవో ఫిర్యాదు చేశారన్నారు. నిర్దిష్ట సమయానికి ముందే పిటిషనర్ సమావేశాన్ని ముగించారన్నారు. ఈ వాదనలను పరిగణలోకి తీసుకున్న న్యాయమూర్తి.. ఈ కేసులో తదుపరి చర్యలన్నింటినీ నిలిపివేస్తూ మధ్యంతర ఉత్తర్వులు జారీ చేశారు.

సదుం ఘటనపై ఎన్నికల సంఘానికి నివేదిక

పుంగనూరు, ఏప్రిల్ 30: సదుంలో సోమవారం బీసీవై పార్టీ ఎన్నికల ప్రచారం సందర్భంగా జరిగిన గొడవల ఘటనపై ఎన్నికల సంఘానికి నివేదిక సమర్పించినట్లు పుంగనూరు ఎన్నికల రిటర్నింగ్ అధికారి వై.మధుసూదన్‌రెడ్డి మంగళవారం తెలిపారు. ఎర్రాతివారిపల్లె, సదుం, కల్లూరు-సదుం మార్గంలో జరిగిన ఘర్షణలు, వాహనాల కాల్చివేత, వాహనాల ధ్వంసం, రాళ్ల దాడులు తదితర అంశాలపై పోలీసు అధికారులు కేసులు నమోదు చేయగా, వీటిపై నివేదిక పంపినట్లు చెప్పారు. కేసులకు సంబంధించి దర్యాప్తు చిత్తూరు ఎస్పీ పర్యవేక్షిస్తారన్నారు.

మహిళా వలంటీరుపై వైసీపీ కౌన్సిలర్ దాడి యత్నం

● రాజీనామా చేసి ప్రచారానికి రావాలని ఒత్తిడి

● ఒప్పుకోకపోవడంతో ఇంటికెళ్లి ఘర్షణ

● పలమనేరు పట్టణంలో ఘటన

చిత్తూరు, ఏప్రిల్ 30 (ఆంధ్రజ్యోతి): జిల్లా వ్యాప్తంగా వలంటీర్లతో రాజీనామాలు చేయించి మరీ వైసీపీ నాయకులు ప్రచారంలో తిప్పుకుంటున్న విషయం తెలిసిందే. ప్రచారానికి రానివాళ్ల మీద ఒత్తిడి చేస్తున్న ఘటనలూ బయటపడుతున్నాయి. తాజాగా పలమనేరు పట్టణంలో ఓ వైసీపీ కౌన్సిలర్ మహిళా వలంటీర్‌పై ఒత్తిడి చేసి, ఆమె ఒప్పుకోకపోవడంతో దాడికి యత్నించాడు. వివరాల్లోకి వెళితే.. పలమనేరు మున్సిపాలిటీకి చెందిన వైసీపీ కౌన్సిలర్ హైదర్ స్థానికంగా ఓ మహిళా వలంటీర్‌ను ప్రచారానికి రావాలని కొంత కాలంగా ఒత్తిడి చేస్తున్నాడు. ఆమె దానికి ఒప్పుకోకపోవడంతో బెదిరింపులకు దిగాడు. ఇంట్లో ఎవరూ లేని సమయంలో అనుచరులతో వెళ్లిన కౌన్సిలర్ రాజీనామా చేసి పార్టీ కార్యక్రమాల్లో పాల్గొనాలని పట్టుబట్టాడు. ఒకటో తేదీలోగా రాజీనామా చేయకపోతే అంతు చూస్తానని బెదిరించినట్లు ఆమె కుటుంబ సభ్యులు ఆరోపిస్తున్నారు. కాగా, పలమనేరులో వలంటీర్లను బలవంతంగా రాజీనామా చేసి ప్రచార కార్యక్రమాల్లో పాల్గొనేలా చేస్తున్నారని, అలాంటి వారిపై ఎన్నికల అధికారులు, పోలీసులు చర్యలు తీసుకోవాలని టీడీపీ నాయకులు కోరుతున్నారు.

ఓటమికి భయపడే మంత్రి పెద్దిరెడ్డి దాడులు



మాట్లాడుతున్న చల్లా రామచంద్రారెడ్డి

చౌడేపల్లె, ఏప్రిల్30: టీడీపీ ప్రభంజనంలో ఓటమి తప్పదని తెలిసే పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి ఆయన కుటుంబీకులు దాడులకు పాల్పడుతున్నారని పుంగనూరు ఎమ్మెల్యే అభ్యర్థి చల్లా రామచంద్రారెడ్డి పేర్కొన్నారు. మంగళవారం ఆయన చౌడేపల్లెలో మీడియాతో మాట్లాడుతూ.. సోమవారం సదుం మండ లంలో జరిగిన దాడులను ఖండించారు. పుంగనూరులో మంత్రి పెద్దిరెడ్డి హిట్లర్‌లా వ్యవహరిస్తూ ప్రజలను భయభ్రాంతులకు గురి చేస్తు న్నారన్నారు. సదుంలో బీసీవై శ్రేణులపై, చౌడేపల్లె టీడీపీ మండలాధ్యక్షులు గువ్వల రమేష్‌రెడ్డిపై దాడులు చేసి మళ్లీ తిరిగి వారిపై కేసులు నమోదు చేయడం ఏమిటని ప్రశ్నించారు. కొందరు పోలీసులు పెద్దిరెడ్డికి తొత్తులుగా మారారని ఆరోపించారు. పోలీసుల తీరుపై కేంద్ర, రాష్ట్ర ఎన్నికల కమిషన్‌కు ఫిర్యాదు చేయనున్నట్లు తెలిపారు. పుంగనూరు నియోజకవర్గంలో రాజ్యాంగబద్ధంగా ఎన్నికలు జరిగితే మంత్రి పెద్దిరెడ్డికి ఓటమి తప్పదన్నారు. పుంగనూరులో టీడీపీ జెండా ఎగురవేసి చంద్రబాబుకు కానుకగా ఇస్తామన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర అధికార ప్రతినిధి సుధాకర్‌యాదవ్, నాయకులు పురుషోత్తమరాజు, ప్రదీప్‌రాజు, జంపాల శ్రీనివాసులు నాయుడు, బాబునాయుడు, కార్తీక్, హరి, రామకృష్ణ, శివన్న, చంద్రమౌళి, ప్రభాకర్, రమణ, మునిరాజు, సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

ఈతకెళ్లి విద్యార్థి మృతి



మూర్తి(ఫైల్‌ఫొటో)

నగరి ఏప్రిల్ 30: పట్టణ పరిధిలోని కాకవేడుకు చెందిన మూర్తి(19) ఈత కోసం బావిలో దిగి మృతి చెందిన ఘటన సోమవారం చోటుచేసుకుంది. మంగళవారం అతని మృతదేహాన్ని బయటకు తీశారు. డిగ్రీ చదువుతున్న మూర్తి స్నేహితులతో కలిసి ఈత కొట్టేందుకు సమీపంలోని బావి వద్దకెళ్లారు. ఈత కొట్టే క్రమంలో అతను లోపల ఇరుక్కుపోయాడు. స్నేహితులు ఎంత ప్రయత్నించినా కనిపించలేదు. చీకటి పడడంతో వారు వచ్చేశారు. మంగళవారం ఉదయం గాలించగా మృతదేహం బయటపడింది. నగరి ఏరియా ఆస్పత్రిలో పోస్టుమార్టం నిర్వహించి, మృతదేహాన్ని బంధువులకు అప్పగించారు.

భానుడి ఉగ్రరూపం

ఆరెంజ్ జోన్‌లోకి నాలుగు మండలాలు

రికార్డు స్థాయిలో తవణంపల్లెలో 44.3 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదు





నిర్మానుష్యంగా ఉన్న గాంధీ సర్కిల్



చిత్తూరు కలెక్టరేట్, ఏప్రిల్ 30: జిల్లాలో ఎండల తీవ్రత కొనసాగుతోంది. మంగళవారం తొలిసారిగా రికార్డు స్థాయిలో తవణంపల్లెలో 44.3, పులిచెర్లలో 44.2 డిగ్రీల గరిష్ఠ ఉష్ణోగ్రత నమోదైంది. పెద్దపంజాణి, పులిచెర్ల, పుంగనూరు, తవణంపల్లె మండలాలు ఆరెంజ్ జోన్‌లోకి వెళ్లాయి. ఎండల ప్రభావంతో మధ్యాహ్నం వేళ రోడ్లపై సంచరించేందుకు జనం ఇబ్బంది పడుతున్నారు. ఎండల తీవ్రత మరో వారం రోజులు ఇలాగే ఉంటుందని వాతావరణ శాఖ చెబుతోంది. సోమలలో 43.1, నింద్ర 42.9, పెద్దపంజాణి 42.7, పుంగనూరు 42.7, బంగారుపాళ్యం, శ్రీరంగరాజపురం 42, సదుం 41.9, గంగవరం 41.2, పాలసముద్రం 41.1, నగరి, చౌడేపల్లి, రొంపిచెర్ల 40.8, గుడిపాల, కుప్పం 40.7, చిత్తూరు 40.6, వెదురుకుప్పం 40.3, శాంతిపురం 40.2, యాదమరిలో 40 డి గ్రీల ఉష్ణోగ్రత నమోదైంది.

దగ్గుమళ్ల అంటే భయపడుతున్నారు

అందుకే సోదాల పేరుతో పోలీసులను ఉసిగొల్పుతున్నారు ● ప్రజాస్వామ్య విలువలను కాలరాస్తున్నారు
● అడ్డదారులు తొక్కుతున్న వైసీపీకి ప్రజా కోర్టులో గుణపాఠం తప్పదు ● దళితభేరిలో ప్రసాదరావు, థామస్



సమావేశంలో మాట్లాడుతున్న దగ్గుమళ్ల ప్రసాద్‌రావు

శ్రీరంగరాజపురం, ఏప్రిల్ 30: టీడీపీతోనే దళితుల అభివృద్ధి సాధ్యమని టీడీపీ చిత్తూరు ఎంపీ అభ్యర్థి దగ్గుమళ్ల ప్రసాదరావు అన్నారు. మంగళవారం పార్టీ నియోజకవర్గ ఎస్సీ సెల్ అధ్యక్షుడు గుండయ్య ఆధ్వర్యంలో పార్టీ కార్యాలయంలో దళితభేరి కార్యక్రమం నిర్వహించారు. ముఖ్య అతిథులుగా దగ్గుమళ్ల ప్రసాదరావు, గంగాధర నెల్లూరు నియోజకవర్గ టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి డాక్టర్ థామస్ హాజరయ్యారు. ఈ సందర్భంగా పద్మాపురం గ్రామ పంచాయతీకి చెందిన వైసీపీ సీనియర్ నాయకుడు వాసుదేవ నాయుడు పాటు 20 కుటుంబాలు థామస్ సమక్షంలో టీడీపీ చేరారు. దగ్గుమళ్ల మాట్లాడుతూ తమకు వస్తున్న ప్రజాదరణను చూసి ఓర్వలేకనే వైసీపీ మూకలు పోలీసులను ఉసిగొల్పి, ఇబ్బందులకు గురి చేస్తున్నారని అన్నారు. అక్రమ మార్గాలను అనుసరిస్తున్న వారికి ప్రజా కోర్టులో గుణపాఠం తప్పదని హెచ్చరించారు. ఇప్పటికే ఎన్డీఏ కూటమి విజయం ఖరారు అయిందన్నారు. ప్రజాభిమానమున్న తమను వైసీపీ నాయకులు భయపెట్టలేరన్నారు. కల్తీ లిక్కర్ తాగి 30వేల మంది చనిపోయారని తెలిపారు. వీరిలో 80శాతం మంది దళితులేనని ఆవేదన వ్యక్తం చేశారు. ఇలాంటి ప్రభుత్వానికి బుద్ధి చెప్పి, సార్వత్రిక ఎన్నికల్లో ఎమ్మెల్యే, ఎంపీ అభ్యర్థులను గెలిపించాలని కోరారు. థామస్ మాట్లాడుతూ నారాయణస్వామి కాలం చెల్లిన రాజకీయ నాయకుడని, నియోజకవర్గంలో ఆయన మాట వినని దళిత యువకులపై, దళిత రైతుపై కేసులు పెట్టారని తెలిపారు. వైసీపీ అభ్యర్థి కృపాలక్ష్మి దర్శనాలను అమ్ముకునే వసూళ్లరాణి అని, ఆమెకు ఓట్లు వేస్తే నియోజకవర్గ అభివృద్ధి శూన్యమవుతుందని అన్నారు. టీడీపీ అధికారంలోకి వచ్చిన వెంటనే నారాయణస్వామి జైలుకు పోవడం ఖాయమన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్సీ సెల్ మండలాధ్యక్షుడు వెంకటాచాలం, ఎస్సీ సెల్ యువత కార్యదర్శి తయ్యూరు నాగరాజు, టీడీపీ మండల అధ్యక్షుడు గంధమనేని జయశంకర్ నాయుడు, రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి చిట్టిబాబు నాయుడు, జనసేన ఇన్‌చార్జి పొన్న యుగంధర్, గ్యాస్ రవికుమార్, రాజేంద్రన్, కుమార్, మణి, కుప్పయ్య, నియోజకవర్గం దళిత నాయకులు పాల్గొన్నారు.



థామస్ సమక్షంలో వైసీపీ నుంచి టీడీపీలోకి చేరిన వాసుదేవ నాయుడు

పేటూరు సమీపంలో ఏనుగుల స్వైరవిహారం





రాలిపోయిన టమోటాలు - విరిగిపోయిన టమోటా ఊతకర్రలు

సోమల, ఏప్రిల్ 30: సోమల మండలం పేటూరు సమీప పొలాల్లో సోమవారం రాత్రి ఆరు ఏనుగుల గుంపు టమోటా తోటల్లో స్వైరవిహారం చేసింది. పంటలను నాశనం చేశాయి. మంగళవారం రామిశెట్టి కుంట వద్ద సంచరించాయని రైతులు తెలియజేశారు. పేటూరుకు చెందిన చంద్రయ్య ఎకరా టమోటా తోటలో తిన్నంత తిని పంటకు ఊతంగా నాటిన కర్రలను ధ్వంసం చేశాయి. సుమారు రూ.2లక్షల మేరకు నష్టం జరిగింది. పేటూరు చెందిన సుబ్రమణ్యం మామిడి తోటలో కొమ్మలను విరిచేశాయి. కాయలను తినేశాయి. డ్రిప్ పైపులను ధ్వంసం చేశాయి. కొత్తచెరువు కట్ట వద్ద ఉన్న మామిడి తోటలో విద్యుత్ స్తంభాన్ని తోసేశాయి. ఆ స్తంభం మామిడి కొమ్మలపై పడడంతో పెనుప్రమాదం తప్పింది. అలాగే ఆ సమీపంలోనే గోకుల షెడ్‌ను కూల్చి వేశాయి. రైతులు పొలాల వద్దకు వెళ్లడానికి భయపడుతున్నారు. అధికారులు చర్యలు తీసుకొని నష్ట పరిహారం మంజూరు చేయాలని బాధిత రైతులు కోరుతున్నారు.



ఏనుగులు విరిచేసిన విద్యుత్ స్తంభం

టీడీపీ నేతలకు చల్లా పరామర్శ



రమేష్‌రెడ్డి తల్లి ఈశ్వరమ్మకు ధైర్యం చెబుతున్న చల్లా

చౌడేపల్లె, ఏప్రిల్ 30: మదనపల్లె సబ్ జైలులో ఉన్న టీడీపీ మండలాధ్యక్షుడు గువ్వల రమేష్‌రెడ్డి, ఆయన అనుచరులను పుంగనూరు ఎమ్మెల్యే అభ్యర్థి చల్లా రామచంద్రారెడ్డి మంగళవారం పరామర్శించారు. తెల్లనీళ్లపల్లెకు వెళ్లి రమేష్‌రెడ్డి అమ్మ ఈశ్వరమ్మను కలసి ధైర్యం చెప్పి, కుటుంబానికి అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. సింగిల్‌విండో మాజీ చైర్మన్ ఓబుల్‌రెడ్డి, రాష్ట్ర అధికార ప్రతినిధి సుధాకర్‌యాదవ్, ఆర్‌వీటి బాబు, ప్రదీప్‌రాజు, కార్తీక్ ఆయన వెంట ఉన్నారు.



మదనపల్లె సబ్ జైలు వద్ద చల్లా రామచంద్రారెడ్డి

రేపు చంద్రగిరిలో హలో....లోకేష్ కార్యక్రమం

చంద్రగిరి, ఏప్రిల్ 30: చంద్రగిరి మండలంలోని అగరాల సమీపంలో గురువారం సాయంత్రం హలో లోకేష్ కార్యక్రమం నిర్వహించనున్నట్లు టీడీపీ నాయకులు తెలిపారు. పూతలపట్టు - నాయుడుపేట జాతీయ రహదారిలో అగరాల సమీపంలోని నారాయణ కళాశాల ఎదురుగా ఉన్న స్థలంలో గురువారం సాయంత్రం 3గంటలకు జరిగే ఈ కార్యక్రమానికి హాజరుకానున్న టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ యువతనుద్దేశించి ప్రసంగించనున్నారు.టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి పులివర్తి నాని ఆధ్వర్యంలో సభాస్థలంలో కార్యక్రమానికి అవసరమైన ఏర్పాట్లు చేస్తున్నారు.బుధవారం రాత్రికే లోకేష్ తిరుపతికి చేరుకోనున్నారు.

ఎన్నికల ఏర్పాట్లపై సమీక్ష

చిత్తూరు కలెక్టరేట్, ఏప్రిల్ 30: ప్రతి ఒక్కరూ ఓటు హక్కును వినియోగించుకునేలా జిల్లాలో స్వీప్ కార్యక్రమాలు చక్కగా నిర్వహిస్తున్నారని కేంద్ర ఎన్నికల సంఘం జిల్లాకు నియమించిన రాష్ట్ర ప్రత్యేక సాధారణ ఎన్నికల పరిశీలకుడు రామమోహన్ మిశ్రా అన్నారు. కలెక్టరేట్‌లోని మీటింగ్ హాలులో మంగళవారం ఎన్నికల ఏర్పాట్లపై సమీక్ష నిర్వహించారు. కలెక్టర్ షన్మోహన్ పవర్‌పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా ఏర్పాట్లను వివరించారు. ఇంతవరకు అక్రమంగా తరలివెళ్తున్న రూ.2.36కోట్ల నగదును సీజ్ చేశామన్నారు. ఎస్పీ మణికంఠ చందోలు మాట్లాడుతూ ఇంతవరకు 821 బైండోవర్ కేసులు రిజిస్టర్ చేశామని చెప్పారు. తమిళనాడు-కర్ణాటక రాష్ట్రాల సరిహద్దుల్లో 21 చెక్‌పోస్టులు ఏర్పాటు చేసినట్లు వివరించారు. సమావేశంలో ఎన్నికల పరిశీలకులు కైలాష్ వాంఖే, షాదిక్ అలాం, అమిత్ రాజ్, జేసీ శ్రీనివాసులు, డీఆర్వో పుల్లయ్య, జిల్లా అధికారులు పాల్గొన్నారు.

డి.ఈఐ.ఎడ్‌కు దరఖాస్తుల ఆహ్వానం

చిత్తూరు (సెంట్రల్), ఏప్రిల్ 30: జిల్లా విద్యా శిక్షణా సంస్థ (డైట్) కార్వేటినగరం, ప్రైవేటు కళాశాలల్లో డిప్లొమా ఇన్ ఎలిమెంటరీ ఎడ్యుకేషన్ (డి.ఈఐ.ఎడ్) 2024లో అడ్మిషన్లకు అర్హులైన అభ్యర్థుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు డైట్ ప్రిన్సిపాల్ శేఖర్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈనెల 9వ తేదీలోపు ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలని పేర్కొన్నారు. ఇంటర్ విద్యార్హతతో జనరల్ కేటగిరి అభ్యర్థులు 50 శాతం, ఎస్సీ, ఎస్టీ, పీహెచ్ కేటగిరి అభ్యర్థులు 45 శాతం మార్కులు కలిగి ఉండాలని వెల్లడించారు. ఈ నెల 24న ప్రవేశ పరీక్ష, 30న ఫలితాల విడుదల ఉంటుందని తెలిపారు. ఉత్తీర్ణులైన అభ్యర్థులకు జూన్ 6 నుంచి 8 వరకు వెబ్ ఆప్షన్ నమోదు, 12 నుంచి 15 వరకు సర్టిఫికేట్ వెరిఫికేషన్, 20 నుంచి తరగతులు ఉంటాయని వివరించారు.

ముఖం కడుక్కోడానికీ నీళ్లు చాలడంలేదు?

● మంత్రి రోజా భర్తని నిలదీసిన నగరి దళితవాసులు



నగరి, ఏప్రిల్ 30: 'తాగునీటిని సక్రమంగా వదలడం లేదు. కనీసం ముఖం కడుక్కోవడానికి కూడా నీళ్లు సరిపోవడం లేదు' అంటూ మంత్రి రోజా భర్త సెల్వమణిని నగరి దళితవాసులు నిలదీశారు. సోమవారం రాత్రి ఆయన ఎన్నికల ప్రచారంలో భాగంగా నగరి దళితవాడలో పర్యటించారు. తాగునీటిని రోజు మార్చి రోజు వదులుతున్నారని ఆయన్ను ప్రశ్నించారు. కాసేపు వదులుతున్న నీటితో కనీసం ముకం కడుక్కోవడానికి కూడా సరిపోవడం లేదని వారు ధ్వజమెత్తారు. ఒక్కసారిగా అందరూ సాగునీటి సమస్యపై నిలదీయడంతో సమాధానం చెప్పలేని స్థితిలో సెల్వమణి వెనుదిరిగారు.

రూ.2 లక్షల నగదు సీజ్

చిత్తూరు, ఏప్రిల్ 30: స్థానిక సంతపేటకు చెందిన సేటు ఎలాంటి బిల్లులూ లేకుండా రూ.2 లక్షల నగదు తీసుకొస్తున్నట్లు సమాచారం అందడంతో రెండో పట్టణ పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ఆధారాలు చూపకపోవడంతో నగదును సీజ్ చేసి, ఖజానా శాఖలో డిపాజిట్ చేసినట్లు సీఐ ఉలసయ్య తెలిపారు.

కర్ణాటక మద్యం తరలిస్తున్న ఆటో సీజ్



ఆటో స్వాధీనం చేసుకుని నిందితున్ని అరెస్టు చేసిన ఎస్ఈబీ సీఐ భాగ్యలక్ష్మి

పుంగనూరు రూరల్, ఏప్రిల్ 30 : కర్ణాటక రాష్ట్రం ముళబాగళ్ నుంచి మద్యం తరలిస్తున్న ఆటోను సీజ్ చేసి, డ్రైవర్‌ను అరెస్ట్ చేసినట్లు ఎస్ఈబీ సీఐ భాగ్యలక్ష్మి మంగళవారం తెలిపారు. పట్టణంలోని మోతీనగర్‌కు చెందిన సయ్యద్ అస్రఫ్‌అలీ ముళబాగళ్ నుంచి 45 బాక్స్‌లు(2,160 ప్యాకెట్లు) రూ.45వేలు విలువ కలిగిన మద్యం తీసుకెళుతుండగా చౌడేపల్లె - రాయలపేట మార్గంలోని శెట్టిపేట క్రాస్ వద్ద పట్టుబడినట్లు చెప్పారు. మద్యం స్వాధీనం చేసుకుని, అతన్ని అదుపులోకి తీసుకుని కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు వివరించారు.

రుయాలో ఆరు నెలల చిన్నారికి కిడ్నీ శస్త్ర చికిత్స



కోలుకున్న బాలుడితో వైద్యాధికారులు

తిరుపతి(వైద్యం), ఏప్రిల్ 30: రుయాస్పత్రిలో ఆరు నెలల చిన్నారికి కిడ్నీ శస్త్రచికిత్స విజయవంతంగా నిర్వహించారు. వివరాలను మంగళవారం సూపరింటెండెంట్ డాక్టర్ రవిప్రభు మీడియాకు తెలిపారు. చిత్తూరు జిల్లా ఎస్ఆర్‌పురం మండలానికి చెందిన కౌశిక్ బాబు అనే ఆరు నెలల బాలుడు.. పుట్టినప్పటి నుంచే కిడ్నీ అడ్డం తిరిగి బాధపడుతున్నాడు. వారం కిందట సమస్య ఎక్కువ కావడంతో తల్లిదండ్రులు రుయా చిన్నపిల్లల విభాగానికి బాలుడిని తీసుకొచ్చారు. వైద్యులు పరీక్షించి, కిడ్నీలో చీము చేరి.. పరిస్థితి విషమంగా ఉన్నట్లు గుర్తించారు. వెంటనే నిపుణులైన డాక్టర్ జగదీష్, డాక్టర్ రాజ్‌కిరణ్, డాక్టర్ మనోహర్‌లు బాలుడికి అత్యంత క్లిష్టమైన శస్త్ర చికిత్సను చేశారు. చీమును తొలగించడంతోపాటు కిడ్నీని సరైన క్రమంలో అమర్చారు. ఇటువంటి సర్జరీ ఇప్పటి వరకు రుయాస్పత్రిలో చేయలేదని ఇదే మొదటిదని, వైద్యబృందాన్ని రవిప్రభు అభినందించారు.ఇటువంటి సర్జరీ కార్పొరేటు ఆస్పత్రుల్లో చేయాలంటే రూ.లక్షలు ఖర్చవుతాయని చెప్పారు.

విధుల్లో నిర్లక్ష్యం వహించిన డాక్టరుకు మెమో

తిరుపతి(వైద్యం), ఏప్రిల్ 30: అత్యవసర విభాగంలో రోగులకు అందుబాటులో ఉండాల్సిన డ్యూటీ డాక్టరు అధికారుల తనిఖీల్లో విధుల్లో లేకుండా నిర్లక్ష్యంగా వ్యవహరించినందుకు అసిస్టెంటు ప్రొఫెసర్ డాక్టర్ కె.ప్రవీణ్‌కు సూపరింటెండెంట్ డాక్టర్ రవిప్రభు మెమో జారీ చేశారు. ఈనెల 25 తేదీ రాత్రి అత్యవసర విభాగాన్ని సీఎస్ఆర్ఎంవో డాక్టర్ లక్ష్మానాయక్ తనిఖీ చేశారు. ఆ సమయంలో డాక్టర్ ప్రవీణ్ విధుల్లో లేకపోవడం.. ఆపై ఆలస్యంగా విధులకు రావడాన్ని గుర్తించారు. ఈ విషయంపై డాక్టర్‌ని మందలించడంతోపాటు డీఎంఈకి, సూపరింటెండెంట్‌కు ఫిర్యాదు చేశారు. స్పందించిన సూపరింటెండెంట్ మెమో జారీ చేశారు.

బీసీవైపీ నేతలపై దాడి చేసిన వారిని అరెస్ట్ చేయాలి

సీపీఐ, సీపీఎం

పుంగనూరు రూరల్, ఏప్రిల్30: సదుంలో పోలీసుల ఎదుటే బీసీవైపీ నేతలపై దాడులు, వాహనాలు కాల్చివేత, ధ్వంసం చేసిన అధికార పార్టీ నాయకులను అరెస్టు చేయాలని సీపీఐ నాయకులు టి.జనార్దన్, నాగరాజు, సీపీఎం నాయకుడు గంగరాజు డిమాండ్ చేశారు. ఎన్నికల కమిషన్ వైఫల్యంతోనే పుంగనూరు నియోజకవర్గంలో అరాచకాలు, దౌర్జన్యాలు జరుగుతున్నాయన్నారు. మంగళవారం వారు విలేకరులతో మాట్లాడుతూ ఎన్నికల కమిషన్ పుంగనూరు నియోజకవర్గంపై ప్రత్యేక నిఘా ఏర్పాటు చేసి, అరాచకశక్తులను అణచివేయాలని డిమాండ్ చేశారు. నియోజకవర్గంలో ప్రతిపక్ష పార్టీలపై నిత్యం దాడులు, దౌర్జన్యాలు జరుగుతున్నా పట్టించుకోకపోవడం సరికాదన్నారు. పుంగనూరులో పోటీ చేస్తున్న అభ్యర్థులకు జెడ్‌కేటగిరి భద్రత కల్పించాలని కోరారు.



నగరిలో ఇద్దరు రోజాలు

ఇదీ సంగతి

నగరి ఎమ్మెల్యే అభ్యర్థిగా వైసీపీ తరపున రాష్ట్ర మంత్రి ఆర్కే రోజా పోటీ చేస్తుండగా ఇండిపెండెంట్‌గా అదే పేరుతో మరో అభ్యర్థిని కే. రోజా బరిలోకి వచ్చింది. నామినేషన్ల ఘట్టం పూర్తి కావడంతో తిరుపతి రూరల్ పుదిపట్లకు చెందిన కే.రోజా అనే మహిళా అభ్యర్థిగా పోటీ చేస్తున్నట్లు ఎన్నికల రిటర్నింగ్ అధికారి ప్రకటించిన లిస్ట్‌లో ఉంది. దీంతో వైసీపీ వర్గాల్లో అయోమయం నెలకొంది. ఈమెకు కుట్టుమిషన్ గుర్తును ఎన్నికల సంఘం కేటాయించింది. పేరుతో ఒకే రకంగా ఉండడంతో వారు తలలు పట్టుకుంటున్నారు. మరోవైపు టీడీపీ అభ్యర్థి గాలి భానుప్రకాష్ పేరు సరిపోలే విధంగా వైసీపీ నాయకులు భానుప్రకాష్ పేరున్న మరో వ్యక్తితో నామినేషన్ దాఖలు చేయించారు. అది స్క్రూటినీలో తిరస్కారానికి గురికావడంతో వారి ప్లాన్ బెడిసికొట్టింది. అలాగే జ్ఞానప్రకాష్ పేరుతో మరో నామినేషన్ కూడా వేయించారు. ఇది సక్రమంగా ఉండడంతో ఆ అభ్యర్థి ఎన్నికల బరిలో నిలిచారు. టీడీపీ అభ్యర్థి గాలి భానుప్రకాష్‌కు ఒకటో నెంబర్ కేటాయించగా జ్ఞాన ప్రకాష్‌కు నాలుగవ నెంబర్ రావడంతో వైసీపీ పాచిక పారలేదనే ప్రచారం జరుగుతోంది. పేర్లతో ఓటర్లను తికమకకు గురిచేయాలనే వైసీపీ ప్రయత్నాలు ఫలించలేదు.

- పుత్తూరు అర్బన్

వైసీపీలో గాజు గ్లాసు ఆశ

అనుకున్నట్లే అయింది. కుప్పంలోనూ స్వతంత్ర అభ్యర్థికి జనసేన పార్టీ గుర్తు అయిన గాజు గ్లాసు సింబల్ కేటాయింపు జరిగిపోయింది. ఎన్నికల నిబంధనల ప్రకారం ఇది సరియైనదే అయినా నైతికంగా మాత్రం తప్పుడు చర్య అని రాజకీయ విశ్లేషకులు వ్యాఖ్యానిస్తున్నారు. వైసీపీ రెబల్‌గా మారి స్వతంత్ర అభ్యర్థిగా బరిలో ఉన్న మొరసనపల్లె అధికార పార్టీ సర్పంచి జగదీశ్ భార్య నీలమ్మకు ఈ గాజు గ్లాసు గుర్తు కేటాయించారు. ఇప్పుడీ గాజు గ్లాసుపైన వైసీపీ 'దింపుడుకళ్లం ఆశ'లు పెట్టుకుంటోంది. 'వైనాట్ కుప్పం' అని వైసీపీ అధినేత జగన్ చెప్పాక.. కుప్పంలో చాలా పరిణామాలు చోటు చేసుకున్నాయి. క్షేత్రస్థాయిలో అధికార పార్టీ గ్రామ స్థాయి నాయకులు సహాయ నిరాకరణ మూడ్‌లోకి వెళ్లిపోయారు. దీంతో మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి బుజ్జగింపులు.. ఈ మధ్య జరిగిన ఒక సమావేశంలో ప్రజాప్రతినిధులపై భరత్ తీవ్రస్థాయిలో అసహనం వ్యక్తం చేయడం వంటి పరిణామాలు ఆ పార్టీ రాబట్టగలిగే ఓట్లెంతో ఒక అంచనాకు వచ్చేశారు అందరూ. కనీసం గౌరవప్రదమైన ఓట్లతో బయటపడితే చాలన్న ఆలోచన పార్టీలో మొదలైపోయిందని చెబుతున్నారు. ఈ నేపథ్యంలో మొదలైన 'గాజు గ్లాసు' ఆలోచనలు చివరకు వైసీపీ రెబల్ అయిన స్వతంత్ర అభ్యర్థి నీలమ్మకు ఆ గుర్తు కేటాయింపు జరిగింది. ఎంతోకొంత నీలమ్మ చీల్చగలిగిన ఓట్లను వైసీపీవి కాక టీడీపీవి అయ్యేలా గట్టి ప్రయత్నాలే సాగుతున్నాయి. కూటమి పార్టీలలో ఒకటైన జనసేన గుర్తు కాబట్టి, సైకిల్‌పై పడాల్సిన ఓట్లు గాజు గ్లాసుపై పడాలని వైసీపీ నాయకులు కోరుకుంటున్నారు. కానీ టీడీపీ అధినేత చంద్రబాబే అభ్యర్థిగా ఉన్న కుప్పంలో వైసీపీ ఆటలు చెల్లేలా మాత్రం కనిపించడంలేదు. ఇక, నగరి అసెంబ్లీ, చిత్తూరు పార్లమెంటు నియోజకవర్గంలోనూ స్వతంత్ర అభ్యర్థులకు 'గాజు గ్లాసు' గుర్తు కేటాయించారు. ఇదంతా ప్లాన్ ప్రకారం జరిగిందన్న వాదనలు వినిపిస్తున్నాయి.

- కుప్పం



జన కేతనం

బుధవారం 1 మే 2024

రాజంపేట లోక్‌సభ బరిలో పెద్దిరెడ్డి, నల్లారి కుటుంబాలు

వాళ్లు.. ఉమ్మడి చిత్తూరు జిల్లాలో మూడు దశాబ్దాలుగా రాజకీయ బద్ధ శత్రువులు. పదేళ్ల ముందర వరకు కాంగ్రెస్ పార్టీలోనే ఉన్నప్పటికీ ప్రత్యర్థులే. పక్క నియోజకవర్గాలైనా.. రాజకీయ వైరం కొనసాగింది. అలాంటి నల్లారి.. పెద్దిరెడ్డి కుటుంబాలు ఈ ఎన్నికల్లో తొలిసారి తలపడుతున్నాయి. రాజంపేట లోక్‌సభ బీజేపీ కూటమి నుంచి మాజీ సీఎం నల్లారి కిరణ్‌కుమార్‌రెడ్డి, వైసీపీ తరపున పెద్దిరెడ్డి మిథున్‌రెడ్డి బరిలో ఉన్నారు. పరస్పర తీవ్ర విమర్శలతో రాజకీయాలూ హీటెక్కుతున్నాయి.





పాత ప్రత్యర్థుల తొలి ఫైట్

- పుంగనూరు

తొలిసారి నేరుగా పోటీ

నాడు ఒకే పార్టీలో ప్రత్యర్థి కుటుంబాలు. నేడు వేర్వేరు పార్టీల అభ్యర్థులుగా రాజంపేట లోక్‌సభకు పోటీపడుతున్నారు. ఎంపీ స్థానానికి కిరణ్ తొలిసారిగా.. మిథున్‌రెడ్డి మూడోసారి బరిలోకి దిగారు. జగన్‌ను 16 నెలలు జైలులో పెట్టారని, సీఎంగా ఆయన అభివృద్ధి చేయలేదంటూ పెద్దిరెడ్డి వ్యక్తిగతంగా దూషిస్తూ ప్రచారం సాగిస్తున్నారు. కిరణ్‌కుమార్‌రెడ్డి కూడా ప్రచారంలో దీటుగా ముందుకు సాగుతున్నారు. ఈయన తరపున ఇప్పటికే చంద్రబాబు, పవన్‌కల్యాణ్ ప్రచారంలో పాల్గొన్నారు. ప్రధాన మంత్రి నరేంద్రమోదీ, కేంద్ర హోంమంత్రి అమిత్‌షా కూడా ప్రచారానికి రానున్నారు.

ఉమ్మడి చిత్తూరు జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడిగా పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి ఉన్నప్పటి నుంచీ ఆయనకు, నల్లారి కిరణ్‌కుమార్‌రెడ్డికి మధ్య రాజకీయ ఆధిపత్య పోరు కొనసాగుతోంది. ఒకే పార్టీలో ఉన్నా వీరిమధ్య సయోధ్య మాటేలేదు. కలికిరిలో కిరణ్‌కుమారెడ్డి చిన్నాన్న నల్లారి తిమ్మారెడ్డి మిషన్ వద్ద సారా నిల్వ విషయంగా పెద్దిరెడ్డి సోదరుడు భాస్కర్‌రెడ్డి గొడవ చేయడంతో వివాదాలు మరింత పెరిగాయి. పూర్వపు వాయల్పాడు నియోజకవర్గం కలికిరి మండలం మేడికుర్తి ప్రాజెక్టు నిర్మాణ టెండర్ పెద్దిరెడ్డి వేయరాదని నల్లారి కిరణ్ ప్రయత్నించగా.. చివరి నిమిషంలో పీఎల్ఆర్ కంపెనీ టెండర్ వేసి పని దక్కించుకుంది. గతంలో తన అనుచరుడైన సుధాకర్ గౌడ్ భార్య, గుర్రంకొండ జడ్పీటీసీ సభ్యురాలు మంజులను జడ్పీ చైర్‌పర్సన్ చేయాలని కిరణ్ భావించగా.. బైరెడ్డిపల్లె జడ్పీటీసీ సభ్యురాలు ఎం.రెడ్డెమ్మకు ఆ పదవి ఇవ్వాలని పెద్దిరెడ్డి పట్టుపట్టారు. నాటి పీసీసీ అధ్యక్షుడు సత్యనారాయణరావు పంచాయితీ చేసి చివరకు రెడ్డెమ్మకు పదవి ఇచ్చారు. 2004లో కాంగ్రెస్ అధికారంలోకి రాగా.. కిరణ్‌కుమార్‌రెడ్డికి మంత్రి పదవి దక్కుతుందని అందరూ భావించారు. కానీ, మంత్రి పదవి రాకుండా పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి తీవ్రంగా అడ్డుకున్నట్లు అప్పట్లో ప్రచారం జరిగింది. దీంతో కిరణ్‌కు ప్రభుత్వ చీఫ్‌విప్ పదవి వరించింది. 2009లోనూ కిరణ్‌కు మంత్రి పదవి రాకుండా అడ్డుపడి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి మంత్రి అయ్యారు. కిరణ్‌కు అసెంబ్లీ స్పీకర్ పదవి దక్కింది. వైఎస్ మృతితో రోశయ్య తర్వాత సీఎం అవకాశం కిరణ్ కుమార్‌రెడ్డికి వచ్చింది. వైఎస్ క్యాబినెట్‌లోని పెద్దిరెడ్డి తప్ప మిగిలిన అందరినీ ఆయన మంత్రులుగా కొనసాగించారు. ఇలా రెండు కుటుంబాలు, వర్గాల మధ్య కొనసాగిన రాజకీయ కక్షలు, విభేదాలు తీవ్రస్థాయికి చేరాయి. గతంలో పీలేరు నియోజకవర్గంలో కిరణ్‌కు వ్యతిరేకంగా పెద్దిరెడ్డి వర్గం.. పుంగనూరులో పెద్దిరెడ్డికి వ్యతిరేకంగా నల్లారి వర్గం ఎన్నికల్లో పనిచేశాయి. ఒకే పార్టీలో ఉన్నప్పటికీ రాజకీయ ఆధిపత్య పోరు కొనసాగింది.

రెండు కుటుంబాల రాజకీయ నేపథ్యం

● కలికిరి మండలం నగరిపల్లెకి చెందిన మాజీ మంత్రి నల్లారి అమరనాథరెడ్డి మృతితో ఆయన భార్య సరోజమ్మ పోటీ చేసి ఓటమి చెందారు. ఆ తర్వాత ఎన్నికల్లో కిరణ్‌కుమార్‌రెడ్డి 1989 నుంచి 2009 వరకు వాయల్పాడు, నియోజకవర్గ పునర్విభజనలో పీలేరు నుంచి కాంగ్రెస్ అభ్యర్థిగా గెలుపొందారు. ప్రభుత్వ చీఫ్ విప్, స్పీకర్, ముఖ్యమంత్రిగా పనిచేశారు. రాష్ట్ర విభజనతో కాంగ్రెస్‌ను వీడి జైసమైక్యాంధ్ర పార్టీ పెట్టారు. ఆ ఎన్నికల్లో ఆయన పోటీ చేయలేదు. కొంతకాలం తర్వాత కాంగ్రెస్‌లో... అనంతరం బీజేపీలో చేరారు. ప్రస్తుతం రాజంపేట ఎంపీ అభ్యర్థిగా పోటీలో ఉన్నారు. ● సదుం మండలం ఎర్రాతివారిపల్లెకు చెందిన పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి కాంగ్రెస్ నుంచి 1989లో పీలేరు ఎమ్మెల్యేగా గెలుపొందారు. ఇలా కిరణ్, పెద్దిరెడ్డి ఒకేసారి ఎమ్మెల్యేలు అయ్యారు. నియోజకవర్గ పునర్విభజనతో పీలేరు నుంచి పుంగనూరుకు వచ్చి ఒకసారి కాంగ్రెస్, రెండుమార్లు వైసీపీ నుంచి ఎమ్మెల్యేగా గెలుపొందారు. వైఎస్ రాజశేఖర్‌రెడ్డి, రోశయ్య క్యాబినెట్‌లో కొంతకాలం.. ప్రస్తుతం జగన్ మంత్రివర్గంలోనూ ఉన్నారు. ఈయన కుమారుడు మిథున్‌రెడ్డి 2014, 2019 ఎన్నికల్లో వైసీపీ తరపున రాజంపేట లోక్‌సభకు పోటీచేసి గెలుపొందారు.

పరస్పరం 'కాళ్ల బేరాల' ఆరోపణలు

- అడ్డదారిలో సీఎం కావడానికి నల్లారి కిరణ్‌కుమార్‌రెడ్డి నాటి కేంద్రమంత్రి చిదంబరం కాళ్లుపట్టుకున్నారని మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి పలుమార్లు ఆరోపణలు చేశారు.
- గతంలో డీసీసీ అధ్యక్ష పదవికి అడ్డుపడకుండా మద్దతు ఇవ్వాలని తిరుపతిలో రాత్రి ఒక్కసారి, మరుసటి రోజు ఉదయం మరోసారి పెద్దిరెడ్డి తన కాళ్లు పట్టుకున్నారని కిరణ్‌కుమార్‌రెడ్డి కౌంటర్ ఇచ్చారు. ఇది నిజమని.. తాను కాణిపాకం, తరిగొండలో ప్రమాణం చేయడానికి సిద్ధమని సవాల్ విసిరారు. తన తండ్రికాలం నుంచి వ్యక్తిత్వాన్ని విడవలేదని, తాను ఎవరి కాళ్లు పట్టుకోలేదని స్పష్టంచేశారు.
- 'సత్యసాయిబాబా మృతితో టన్నులు టన్నుల బంగారాన్ని లారీల్లో తరలించి చిదంబరం, కిరణ్‌కుమార్‌రెడ్డి దోచుకున్నారని పెద్దిరెడ్డి చేసిన ఆరోపణలు నిరాధారం. అయ్యప్పస్వామి గుడిలో ఆయన ప్రమాణం చేయాలి' అంటూ కిరణ్ మరోసారి సవాల్ విసిరారు.
- తాను సోనియాగాంధీ కాళ్లే పట్టుకోలేదని, కిరణ్ కాళ్లు పట్టుకోవాల్సిన దుర్గతి పట్టలేదని, మిథున్ చేతిలో ఓడిపోవడం ఖాయమని ఎన్నికల ప్రచారాల్లో పెద్దిరెడ్డి చెబుతున్నారు.

- ఇలా నల్లారి కిరణ్‌కుమార్‌రెడ్డి మళ్లీ రాజకీయాల్లోకి వచ్చి పెద్దిరెడ్డిపై తీవ్రవిమర్శలు చేయడం, కాళ్లు పట్టుకున్నారన్న ఆరోపణలు ప్రజల్లో చర్చనీయాంశంగా మారాయి.

- కిరణ్ గెలిస్తే కేంద్ర మంత్రి అవుతారని, రాజంపేట పార్లమెంటు అభివృద్ధి చెందుతుందని, పెద్దిరెడ్డిని నిలవరించే వ్యక్తి వచ్చారని కూటమి పార్టీలు ప్రచారం చేస్తున్నాయి.

ఎన్నికల బరిలో తండ్రీ కొడుకులు, అన్నదమ్ములు





రాజంపేట లోక్‌సభకు వైసీపీ అభ్యర్థిగా పెద్దిరెడ్డి మిథున్‌రెడ్డి పోటీ చేస్తుండగా, ఇదే నియోజకవర్గ పరిధిలోని పుంగనూరులో ఆయన తండ్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి.. తంబళ్లపల్లెలో ఆయన చిన్నాన్న ద్వారకనాథరెడ్డి పోటీ చేస్తున్నారు.

రాజంపేట లోక్‌సభ బీజేపీ అభ్యర్థిగా మాజీ సీఎం నల్లారి కిరణ్‌కుమార్‌రెడ్డి పోటీ చేస్తున్నారు. ఇదే నియోజకవర్గ పరిధిలోని పీలేరులో టీడీపీ అభ్యర్థిగా ఆయన సోదరుడు నల్లారి కిశోర్‌కుమార్‌రెడ్డి బరిలో ఉన్నారు.





● గుర్తుంచుకో

మీ ఓటూ ముఖ్యమే

ఓటు విలువ తెలియజేసేలా అధికార యంత్రాంగం నెల రోజులుగా ప్రచార చర్యలు చేపట్టింది. వివిధ కార్యక్రమాల ద్వారా ప్రజలకు అవగాహన కల్పిస్తోంది. 'మీ ఓటూ ముఖ్యమే', ప్రజాస్వామ్యం నీతోనే మొదలవుతుంది' తదితర నినాదాలతో ఫ్లెక్సీలను ఏర్పాటు చేస్తోంది. చిత్తూరులోని పలు కూడళ్లు.. జనసందడి ఎక్కువగా ఉండే ప్రాంతాల్లో ఈ తరహా బోర్డులను పెడుతున్నారు. ఇంకా '2024 లోక్‌సభ, శాసన సభ ఎన్నికల్లో ఓటు వేయడం మన హక్కు,యువత మేల్కొనండి, చైతన్యవంతమైన ప్రజాస్వామ్యం కోసం తప్పనిసరిగా ఓటు వినియోగించుకోండి' అంటూ ఓటు ప్రాధాన్యాన్ని తెలియజేస్తోంది. ఈ ప్రచార బోర్డులు ఓటర్లను ఆకర్షిస్తున్నాయి.

- చిత్తూరు

సిద్దేశ్వరుడిని దర్శించుకున్నాకే ప్రచారం



● సెంటిమెంట్

ఎన్నికలు ఏ స్థాయివైనా సరే.. సిద్దేశ్వరుడిని దర్శించుకున్నాక, ఆ గ్రామం నుంచే ప్రచారం మొదలు పెడతారు. గంగాధరనెల్లూరు నియోజకవర్గంలో ఈ సెంటిమెంట్‌ను పాటిస్తున్నారు. జీడీనెల్లూరు మండలం వింజం పంచాయతీలోని సిద్దేశ్వరకొండ గ్రామంలో సిద్దేశ్వరస్వామి ఆలయం ఉంది. వేపంజేరి నియోజకవర్గంగా ఉన్నప్పుడే మాజీ మంత్రి గుమ్మడి కుతూహలమ్మ ఈ సెంటిమెంట్‌ను కొనసాగించారు. ఐదుసార్లు గెలవడం, మంత్రి, డిప్యూటీ స్పీకరు పదవులు పొందడంతో ఈ సెంటిమెంట్ బలంగా మారింది. జీడీనెల్లూరు నియోజకవర్గం ఆవిర్భవించిన తర్వాతా దీనిని పాటిస్తున్నారు. గత ఎన్నికల్లో వైసీపీ అభ్యర్థిగా కళత్తూరు నారాయణస్వామి కూడా ఈ ఆలయంలోనే పూజలుచేసి ఎన్నికల ప్రచారం ప్రారంభించారు. ఇప్పుడూ టీడీపీ అభ్యర్థి డాక్టర్ థామస్, వైసీపీ అభ్యర్థి కృపాలక్ష్మి కూడా వేర్వేరు రోజుల్లో ఈ ఆలయంలోనే పూజలు చేసి.. ఇక్కడే ఎన్నికల ప్రచారం ప్రారంభించారు. మండలంలో ఎంపీటీసీ, జడ్పీటీసీ, సర్పంచి ఎన్నికల్లోనూ పోటీచేసే అభ్యర్థులు సెంటిమెంట్‌గా సిద్దేశ్వరస్వామిని దర్శించుకుని పూజలు చేసి మొక్కుకున్నా.. ఈ గ్రామంలోనే ఎన్నికల ప్రచారాన్ని ప్రారంభించారు. మరిప్పుడు అసెంబ్లీ ఎన్నికల్లో ఈ సెంటిమెంట్ ఎవరికి వర్కవుట్ అవుతుందో చూడాలి.

- గంగాధరనెల్లూరు

144 సెక్షన్ ఎందుకు విధిస్తారు?

● మీకు తెలుసా..?

ఎన్నికలు, అల్లర్లు జరిగేటప్పుడు, పరీక్షల నిర్వహణ సమయంలో ఎక్కువగా 144 సెక్షన్ విధిస్తుంటారు. అసలు 144 సెక్షన్ అంటే ఏమిటి, ఎందుకు, ఎప్పుడు విధిస్తారో తెలుసుకుందాం. సీఆర్‌పీసీ 144 సెక్షన్ కింద ఎగ్జిక్యూటివ్ మేజిస్ట్రేట్‌లకు విస్తృత అధికారాలు కల్పించారు. ప్రధానంగా శాంతి భద్రతలకు విఘాతం కలిగిన సమయంలో పరిస్థితులను అదుపులోకి తీసుకొచ్చేందుకు ఈ సెక్షన్ అమలు చేస్తారు. సార్వత్రిక ఎన్నికల సమయంలోనూ పోలింగ్ కేంద్రాల వద్ద 144 సెక్షన్ విధిస్తారు. ఈ సెక్షన్ అమల్లోకి వస్తే నలుగురు, ఐదుగురు వ్యక్తులకు మించి గుమిగూడకూడదు. కలిసి తిరగడంపైనా నిషేధాజ్ఞలు ఉంటాయి. ఎన్నికల సమయంలో నామినేషన్ల ప్రక్రియ నుంచి ఓట్ల లెక్కింపు పూర్తయ్యే వరకు ఈ సెక్షన్ అమల్లో ఉంటుంది. ఆ సమయంలో ప్రదర్శనలు, ఊరేగింపులు, ర్యాలీలు చేయకూడదు. ప్రధానంగా రెండు పార్టీలు, గ్రూపుల మధ్య తగాదాలు తలెత్తినప్పుడు కూడా విధిస్తారు. రెండు నెలల వరకు కలెక్టర్, ప్రభుత్వం నియమించిన మెజిస్ట్రేట్, పోలీసులు మ్యాన్యువల్ ప్రకారం ఎస్పీలు ఈ సెక్షన్‌ను అమలు చేస్తారు.

- చిత్తూరు

ఎవరు గెలవాలన్నా 'ఆమె' ఆశీర్వదం ఉండాల్సిందే. అన్ని నియోజకవర్గాల్లోనూ మహిళా ఓటర్లే ఎక్కువగా ఉన్నారు. ఇక, పోలింగ్ రోజున వీరి ఓటింగ్ శాతమే అధికం. ఈ పరిణామాలతో అభ్యర్థుల గెలుపునకు మహిళా ఓటర్లు కీలకంగా మారారు. రెండు దశాబ్దాలుగానూ వీరి తీర్పే ఓటర్ల గెలుపు రాతను నిర్దేశిస్తోంది.

- చిత్తూరు కలెక్టరేట్



ఆమె ఆశీర్వాదం ఉంటేనే..!

- అభ్యర్థుల గెలుపులో మహిళా ఓటర్లే కీలకం
- పురుషులకంటే 23,528 మంది ఎక్కువ

జిల్లాలోని ఏడు అసెంబ్లీ నియోజకవర్గాలు, ఒక లోక్‌సభ సెగ్మెంట్‌లో అభ్యర్థుల గెలుపునకు మహిళా ఓటర్లే కీలకంగా మారారు. జిల్లా ఓటర్ల తుది జాబితాను జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ షన్మోహన్ మంగళవారం విడుదల చేశారు. జిల్లాలో మొత్తం ఓటర్లు 15,63,911 మంది ఉన్నారు. వీరిలో పురుష ఓటర్లు 7,70,154, మహిళా ఓటర్లు 7,93,682 మంది, థర్డ్ జెండర్ 75 మంది ఉన్నారు. పురుషుల కంటే 23,528 మంది మహిళా ఓటర్లు అధికంగా ఉండడం విశేషం. చిత్తూరు, పలమనేరు, పుంగనూరు, కుప్పం, పూతలపట్టు, గంగాధరనెల్లూరు, నగరి నియోజకవర్గాల్లో పురుష ఓటర్లకంటే మహిళా ఓటర్లే అధికంగా ఉన్నారు. ఈ నేపథ్యంలో అన్ని రాజకీయ పార్టీలు ఎన్నికల్లో గెలుపుకోసం మహిళా ఓటర్లను ఆకర్షించేలా మ్యానిఫెస్టోలో ప్రత్యేక పథకాలు ప్రకటించాయి. సరికొత్త పథకాలతో మహిళా ఓటర్లను ఆకర్షించే పనిలో తలమునకలయ్యాయి. ఏదిఏమైనా జిల్లాలో రానున్న ఎన్నికల్లో గెలుపోటములను నిర్ణయించేది మహిళా ఓటర్లేనని విశ్లేషకులు చెబుతున్నారు. మరి వీరంతా ఎవరిని ఆశీర్వదిస్తారో చూడాలి. రెండు దశాబ్దాలుగానూ మహిళా ఓటర్ల తీర్పే అభ్యర్థుల విజయావకాశాలను నిర్ణయిస్తోంది. వీరు ఎక్కువగా ఉండటం, గంపగుత్తగా ఓట్లు వేయడం వల్ల వీరి ప్రభావం అధికంగా ఉంది.

నియోజకవర్గం	పురుష ఓటర్లు	మహిళా ఓటర్లు	థర్డ్ జెండర్	మొత్తం ఓటర్లు
పుంగనూరు	1,17,072	1,21,791	05	2,38,868
నగరి	98,537	1,04,029	08	2,02,574
జీడీనెల్లూరు	1,01,853	1,03,090	06	2,04,949
చిత్తూరు	98,718	1,04,101	31	2,02,850
పూతలపట్టు	1,08,811	1,12,181	07	2,20,999
పలమనేరు	1,32,653	1,35,243	00	2,67,896
కుప్పం	1,12,510	1,13,247	18	2,25,775
మొత్తం	7,70,154	7,93,682	75	15,63,911

బాబు వస్తేనే యువతకు ఉపాధి



బగళనత్తంలో బాబును మళ్లీ రప్పిద్దాం కార్యక్రమంలో విశ్వనాథ్ తదితరులు

రామకుప్పం, ఏప్రిల్ 30: రాష్ట్రంలో యువతభవిత బాగుండాలంటే తిరిగి చంద్రబాబు సీఎం కావాలని తెలుగుయువత మండల అధ్యక్ష, ప్రధానకార్యదర్శులు విశ్వనాథ్, వెంకటాచలం, నియోజకవర్గ ప్రధానకార్యదర్శి శంకర్‌చలం తెలిపారు. మంగళవారం మండల పరిధి బందార్లపల్లె, ఉన్సిగానిపల్లె పంచాయతీల్లో 'యువతకు ఉద్యోగ, ఉపాధి కోసం బాబును మళ్లీ రప్పిద్దాం' కార్యక్రమాల్లో వారు మాట్లాడారు. చంద్రబాబు వస్తేనే యువతకు ఉద్యోగాలు వస్తాయని తెలియజేశారు. ఆయా కార్యక్రమాల్లో నేతలు శ్రీనాథరెడ్డి, వెంకటరమణ, జ్ఞానశేఖర్‌రెడ్డి, పెరుమాళ్, ఉమేష్‌గౌడ, బాబూసాబ్, రామాంజులు, మంజునాథరెడ్డి, సుభాష్ పాల్గొన్నారు.

యువతలో వైసీపీపై ఆగ్రహం



టీడీపీలో చేరిన శాంతిపురం మండల యువకులు

కుప్పం, ఏప్రిల్ 30: రాష్ట్రవ్యాప్తంగా యువతలో వైసీపీపై తీవ్రమైన ఆగ్రహావేశాలు వ్యక్తమవుతున్నాయని ఎమ్మెల్సీ కంచర్ల శ్రీకాంత్, టీడీపీ నియోజకవర్గ ఇన్‌ఛార్జి పీఎస్.ముని రత్నం, పార్టీ రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరీ డాక్టర్ బీఆర్.సురేశ్‌బాబులు అన్నారు. స్థానిక తెలుగు దేశం పార్టీ కార్యాలయంలో మంగళవారం పార్టీ నియోజకవర్గ నాయకుల సమక్షంలో శాంతి పురం మడలానికి చెందిన యువత పెద్దసంఖ్యలో వైసీపీ నుంచి టీడీపీలో చేరారు. శాంతిపురం మండల పార్టీ అధ్యక్షుడు విశ్వనాథనాయుడు, భాస్కర్‌ల ఆధ్వర్యంలో శాంతిపురం మండలం సి.బండపల్లెకు చెందిన సుమారు 50 వన్నెకుల క్షత్రియ కుటుంబాలు వైసీపీని వీడి టీడీపీలో చేరాయి. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు జనార్దననాయుడు, ఉదయ్‌కుమార్, వెంకట రమణ బాబు, సురేశ్, మణి, చంద్ర తదితరులు పాల్గొన్నారు.

మైనారిటీల అభివృద్ధి ఘనత చంద్రబాబుదే



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న రఫీ తదితరులు

కుప్పం, ఏప్రిల్ 30: రాష్ట్రంలో మైనారిటీలను అభివృద్ధి చేసిన ఘనత తెలుగుదేశం పార్టీ అధినేత చంద్రబాబుదేనని ఆ పార్టీ ముస్లిమ్స్ వెల్ఫేర్ రాష్ట్ర అధ్యక్షులు రఫీ అన్నారు. స్థానిక పార్టీ కార్యాలయంలో మంగళవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. మసీదులు, షాదీఖానాల నిర్మాణం, ఖబరస్థాన్‌ల అభివృద్ధి వంటివన్నీ చంద్రబాబు పాలనలోనే జరిగాయని గుర్తుచేశారు. రాష్ట్రంలోని మైనారిటీలందరూ ఏకమై ఎన్డీయే కూటమికి ఓటువేసి గెలిపించాలని అభ్యర్థించారు. ఈ కార్యక్రమంలో ముస్లిం మైనారిటీ నాయకులు జాకీర్, ఇక్బాల్, చాంద్‌బాషా, హిదయతుల్లా తదితరులు పాల్గొన్నారు.

లక్ష ఓట్ల మెజారిటీ మన లక్ష్యం: టీడీపీ




మోట్లచేనులో ప్రచారం చేస్తున్న ప్రేమ్‌కుమార్ తదితరులు


కుప్పం రూరల్, ఏప్రిల్ 30: చంద్రబాబుకు లక్ష ఓట్ల మెజారిటీ సాధించి పెట్టడమే లక్ష్యంగా ఓట్లు వేయాలని టీడీపీ కుప్పం మండల అధ్యక్షుడు ప్రేమ్‌కుమార్ ప్రజలను కోరారు. మండలంలోని మోట్లచేను, మిట్టపల్లె గ్రామాల్లో మంగళవారం ఆయన పార్టీ శ్రేణులతో కలిసి విస్తృతంగా ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ● మండలంలోని బ్రహ్మదేవర చేను గ్రామంలో మండల తెలుగు యువత అధ్యక్షుడు సుబ్బు ఆధ్వర్యంలో ఎన్నికల ప్రచారం చేశారు. ఆయా కార్యక్రమాల్లో యూనిట్ ఇన్‌ఛార్జిలు సుధాకర్, మోహన్, పళణి, లీలావెంకటేశ్, క్లస్టర్ ఇన్‌ఛార్జి ఏపీ.రవి, మాజీ ఎంపీపీ సాంబశివం, రామచంద్ర, చలపతి, కుప్పం మండల టీడీపీ బీసీ సెల్ అధ్యక్షుడు ఈశ్వర్, యూనిట్ ఇన్‌ఛార్జి శివకుమార్, అశోక్, కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఉమ్మడి మేనిఫెస్టోతో అన్ని వర్గాలకు లబ్ధి

కుప్పం, ఏప్రిల్ 30: టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి విడుదల చేసిన ఉమ్మడి మేనిఫెస్టోతో అన్ని వర్గాలకు సమాన లబ్ధి చేకూరుతుందని ఎమ్మెల్సీ కంచర్ల శ్రీకాంత్, టీడీపీ నియోజకవర్గ ఇన్‌ఛార్జి పీఎస్.మునిరత్నం, చంద్రబాబు వ్యక్తిగత కార్యదర్శి మనోహర్, టీడీపీ రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరీ డాక్టర్ బీఆర్.సురేశ్‌బాబు అన్నారు. స్థానిక పార్టీ కార్యాలయంలో మంగళవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. మహిళల ప్రయోజనాలకు మ్యానిఫెస్టోలో ప్రథమ ప్రాధాన్యత లభించిందన్నారు. నిరుద్యోగులకు, ఉద్యోగులకు మేలు చేకూరుతుందన్నారు. డీఎస్సీపై తొలి సంతకం చేస్తామని చంద్రబాబు ప్రకటించడం నిరుద్యోగులపైన ఆయనకున్న శ్రద్ధకు నిదర్శమన్నారు. ల్యాండ్ టైటిలింగ్ యాక్ట్ ద్వారా ప్రజల భూములను లాక్కునే పన్నాగానికి జగన్‌రెడ్డి తెరతీశారని ధ్వజమెత్తారు. చంద్రబాబు ముఖ్యమంత్రిగా ప్రమాణ స్వీకారం చేసిన వెంటనే ఆ చట్టాన్ని సవరిస్తామని హామీ ఇచ్చారని తెలియజేశారు. టీడీపీ నాయకులు కన్నన్ పాల్గొన్నారు.

నేత్రపర్వంగా పంచపుష్పపల్లకీ సేవ







పంచపుష్ప పల్లకీల ఊరేగింపు ● పుష్పపల్లకిలో అన్నపూర్ణదేవి, కాశీవిశ్వేశ్వరుడు, గజవాహనంపై సల్లాపురెమ్మ

రామకుప్పం, ఏప్రిల్ 30: రామకుప్పంలోని అన్నపూర్ణ సమేత కాశీవిశ్వేశ్వరస్వామి వార్షిక బ్రహ్మోత్సవాలు ముగింపు సందర్భంగా సోమవారం రాత్రి పంచపల్లకీసేవ నేత్రపర్వంగా జరిగింది. రాత్రి 10గంటలకు ఆలయం ఎదుట నుంచి సవారిపల్లకీలో అన్నపూర్ణదేవి, కాశీవిశ్వేశ్వరస్వామి ఉత్సవర్లను, ముత్యాలపల్లకీలో సీతా లక్ష్మణ సమేత కోదండరామస్వామి, గజవాహనపల్లకీపై సల్లాపురెమ్మ, పుష్పపల్లకీల్లో గంగమ్మ, పోతురాజు, సిద్ధి, బుద్ధిసమేత వరసిద్ధి వినాయకస్వామి ఉత్సవర్లను అధిష్ఠింపజేశారు. మేళతాళాలు, డప్పులహోరు, బాణసంచా వేడుకల మధ్య పల్లకీలను దిగువవీధి, ఆర్యవైశ్యవీధి, శివాజీనగర్, ఎగువబైపాస్ రోడ్డు, సెంటర్ ఆటోస్టాండు, షాదీమహల్, మెయిన్‌బజారు, బ్రాహ్మణవీధి మీదుగా ఊరేగించారు. భక్తులు అడుగడుగునా దేవతామూర్తులకు కొబ్బరికాయలు, కొట్టి కర్పూర హారతులిచ్చారు. రాత్రంతా వీధుల్లో విహరించిన పల్లకీలు తెల్లవారు జామున 3:45గంటలకు తిరిగి ఆలయం వద్దకు చేరుకున్నాయి. కుప్పం గ్రామీణ సీఐ ఈశ్వర్‌రెడ్డి, ఎస్ఐ శివకుమార్‌లు తమ సిబ్బందితో బందోబస్తు నిర్వహించారు.

పలమనేరు
కుప్పం/పుంగనూరు

ఈవీఎం స్ట్రాంగ్ రూమ్స్ పరిశీలన

పుంగనూరు రూరల్: పుంగనూరు ప్రభుత్వ శుభారాం డిగ్రీ కాలేజీలో ఏర్పాటు చేసిన ఈవీఎంల స్ట్రాంగ్ రూములను మంగళవారం రాజంపేట పార్లమెంట్ వ్యయ పరిశీలకుడు మణీందర్ కుమార్, పోలీసు అబ్జర్వర్ దిల్‌నవాజ్ అహ్మద్ సందర్శించి పలు సూచనలు చేశారు. వీరి వెంట ఎన్నికల అధికారి మధుసూదన్‌రెడ్డి, తహసీల్దార్ శివయ్య పాల్గొన్నారు.

అరాచకాలు ఆగాలంటే టీడీపీ గెలవాలి







రొంపిచెర్ల జాండ్లవారిపల్లెలో చల్లా సుప్రియారెడ్డి, పుంగనూరు సుగాలిమిట్టలో వీణారెడ్డి ప్రచారం, పులిచెర్ల మండల తోటవారిపల్లిలో ప్రచారం

చౌడేపల్లె, ఏప్రిల్30: ఉమ్మడి మేనిఫెస్టోతో అన్ని వర్గాల ప్రజలు అభివృద్ధి చెందుతారని పుంగనూరు టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి చల్లా రామచంద్రారెడ్డి పేర్కొన్నారు. మంగళవారం ఆయన మండలంలోని ఏకొత్తకోట, అంకుతోట పల్లె, కుంచనపల్లె, ఎస్ అగ్రహారం గ్రామాలలో ఇంటింటా ప్రచారం చేశారు. రైతులకు 9 గంటలు ఉచిత విద్యుత్, రాయితీపై సోలార్ పంపు సెట్లు, వ్యవ సాయ పరికరాలు, పింఛను రూ.4వేలు, దివ్యాంగులకు రూ.6వేల పింఛను ఇస్తామన్నారు. ముఖ్యంగా ల్యాండ్ టైటిలింగ్ యాక్ట్ రద్దు చేసి రైతుల భూములకు రక్షణ కల్పిస్తామని తెలియజేశారు. తనను ఎమ్మెల్యేగా, కిరణ్‌కుమార్‌రెడ్డిని రాజంపేట ఎంపీగా గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర అధికార ప్రతినిధి సుధాకర్‌యాదవ్, నాయకులు పురుషోత్తం రాజు, ప్రదీప్‌రాజు, హరిప్రసాద్, కార్తీక్, రెడ్డి, మునిరాజు, బాబునాయుడు, చంద్రమౌళి, కుమార్‌రెడ్డి, విజయభాస్కర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సోమల: ఎన్‌డీఏ కూటమి అభ్యర్థులను గెలిపించాలని టీడీపీ మండల అధ్యక్షుడు సుబ్రమణ్యం నాయుడు ఆధ్వర్యంలో మిట్టపల్లెలో ఇంటింటా కరపత్రాలను అందజేశారు. ● నెల్లిమంద గొల్లపల్లెలో ఈశ్వర్ యాదవ్, పుల్లయ్య, వెంకటరమణ, గంగాధరం, రెడ్డి శేఖర్ ప్రచారం చేశారు. ● జనసేన మండల పార్టీ అధ్యక్షుడు సూరిశెట్టి నాగభూషణం రాయల్ ఆధ్వర్యంలో సూరయ్యగారిపల్లెలో ప్రచారం చేశారు. టీడీపీ నాయకులు మాజీ ఎంపీటీసీ సభ్యులు పాల్గొన్నారు.

కల్లూరు: చంద్రబాబు, పవన్‌కళ్యాన్ ప్రకటించిన ఉమ్మడి మేనిఫేస్టోతో రాష్ట్రంలో ఎన్డీఏ కూటమి అధికారంలోకి రావడం తథ్యమని రాష్ట్ర తెలుగు రైతు ఉపాధ్యక్షులు రామనాథం నాయుడు తెలిపారు. పులిచెర్ల మండలం బోడిరెడ్డిగారిపల్లి పంచాయతీలోని తోటవారిపల్లి, ఆవుల పెద్దిరెడ్డిగారిపల్లి, ఎస్సీ కాలనీల్లో టీడీపీ ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈకార్యక్రమంలో టీడీపీ నాయకులు సుబ్బారెడ్డి, రాజేష్, పూలరమేష్, త్యాగరాజ, చంద్రశేఖర్, మోహన్‌దాస్, మహేష్, భాస్కర్, నవీన్, బాబునాయుడు, బాబయ్య, రవి, సుబ్రమణ్యం, మదన్‌మోహన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రొంపిచెర్ల: కూటమి అభ్యర్థులను గెలిపించాలని రొంపిచెర్లలో టీడీపీ, జనసేన నాయకులు ముమ్మర ప్రచారం చేశారు. టీ డీపీ నాయకులు రామమూర్తి, షేక్ కరీముల్లా, అంజాద్‌ఖాన్, రాధాక్రిష్ణ, హయద్‌బాషా పాల్గొన్నారు. ● చల్లా రామచంద్రారెడ్డి సతీమణీ చల్లా సుప్రియారెడ్డి జాండ్లవారిపల్లె, కస్పాపేట, దుస్సావారిపల్లె, బందావారిపల్లె, కనంకాడ హారిజనవాడలో ఇంటింటా ప్రచారం చేశారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు ఉయ్యాల రమణ, సిద్ధయ్య పాల్గొన్నారు.

పుంగనూరు: వైసీపీ అరాచకాలను అంతం చేయడానికి పుంగనూరు ప్రజలు తెలుగుదేశం పార్టీని ఆదరిస్తూ బ్రహ్మరథం పడుతున్నారని టీడీపీ అభ్యర్థి చల్లా రామచంద్రారెడ్డి సోదరి వీణారెడ్డి పేర్కొన్నారు. పుంగనూరు మండలం సుగాలిమిట్ట పంచాయతీలో మండల టీడీపీ, జనసేన నాయకులతో కలసి ఇంటింటా ప్రచారం చేశారు. నాయకులు మాధవరెడ్డి, విరూపాక్షి, కవిత, కృష్ణానాయక్, బాలాజీ నాయక్, రూపేంద్రనాయక్, హరినాయక్, గంగాధర్, రాఘవ పాల్గొన్నారు. ● అలాగే పట్టణంలో టీడీపీ నాయకులు సుబ్రహ్మణ్యంరాజు, కౌన్సిలర్ రామ కృష్ణమరాజు, మురాది దినేశ్, సుహేల్‌బాషా, దేశాద్రిప్రకాశ్, రామయ్య, సద్దాంహుస్సేన్‌లు ఇంటింటా కరపత్రాలను పంపిణీ చేశారు. టీడీపీని గెలిపించాలని ఓటర్లను అభ్యర్థించారు.

విధ్వంస పాలనకు చరమగీతం పాడండి





అమరనాథరెడ్డికి స్వాగతం పలుకుతున్న కొంగాటం నేతలు, టీడీపీలో చేరిన ధర్మపురి వాసులు

వి.కోట, ఏప్రిల్ 30: విధ్వంసక పాలన కొనసాగిస్తున్న వైసీపీ ప్రభుత్వానికి ప్రజలు చరమగీతం పాడాలని మాజీ మంత్రి అమరనాథరెడ్డి పిలుపునిచ్చారు. మంగళవారం వి.కోట మండలం కొంగాటం పంచాయతీలో ఆయన ముస్లిం, మైనారిటీలతో కలిసి ఎన్నికల ప్రచారం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వి.కోట మండలానికి తమ హయాంలో మంజూరు చేసిన అనేక అభివృద్ధి పనులు ఆపేశారని అధికారంలోకి తిరిగి వాటిని పునరుద్ధరిస్తామన్నారు. ఆయన వెంట ఏఎంజీ మాజీ చైర్మన్ రామచంద్ర నాయుడు, మండల పార్టీ అధ్యక్షులు రంగనాథ్, ప్రధాన కార్యదర్శి ఈశ్వర్, మాజీ వైస్ ఎంపీపీ గోపీనాథ్, నాయకులు చౌడప్ప, రాంబాబు, రుహుల్లా, నాసీర్, చంద్రా రెడ్డి, సోమశేఖర్, విశ్వనాథ రెడ్డి, కుమార్, సర్పంచ్ విశ్వనాథ్ ఉన్నారు.

పలమనేరు: సీఎం జగన్ మూడు రాజధానుల పేరుతో రాష్ట్రప్రజలకు మూడు నామాలు పెట్టారని మాజీ మంత్రి అమరనాథరెడ్డి ఎద్దేవా చేశారు. కొలమాసనపల్లి గ్రామంలో ఆయన ఎన్నికల ప్రచారం నిర్వహించారు. పలువురు టీడీపీలో చేరారు. అనంతరం రత్నా బయోటెక్ అధినేత రత్నారెడ్డి, గంగిరెడ్డి దంపతులను కలిసి ఈ ఎన్నికల్లో తనకు మద్దతు ఇవ్వాలని కోరారు. ఎర్రగుండేపల్లికి చెందిన చిన్న, వెంకటేసు, సూరి, బాబు, సంతోష్, వినోద్, రమేష్ తదితరులు వైసీపీని వీడి టీడీపీలో చేరారు. ● గంగవరం మండలం గండ్రాజుపల్లి పంచాయతీ మార్లపల్లి గ్రామానికి చెందిన యువత టీడీపీలో చేరారు. పలమనేరులోని పార్టీ కార్యాలయంలో వారు అమరనాథరెడ్డి సమక్షంలో టీడీపీ తీర్థం స్వీకరించారు.

గంగవరం: గంగవరం పంచాయతీ పరిధిలోని సాయినగర్, గంగవరం, సాయిగార్డెన్ సిటీ, ద్వారకామై వీధి తదితర ప్రాంతాలలో టీడీపీ నాయకులు ప్రచారం చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ మురళి, ప్రసాద్‌నాయుడు, రవి, యుగంధర్, రెడ్డెప్ప, గిరిధర్ గోపాల్, చిట్టిబాబు పాల్గొన్నారు.

బైరెడ్డిపల్లె: మండలంలోని ధర్మపురిలో, తీర్థం గ్రామంలో మాజీ మంత్రి అమరనాథరెడ్డి ప్రచారం చేశారు. ధర్మపురి, కమ్మనపల్లె పంచాయతీలకు చెందిన పలువురు ఆయన సమక్షంలో టీడీపీలో చేరారు.

పలమనేరు బరిలో ఆరుగురు వీ.కోట వాసులే

పలమనేరు, ఏప్రిల్30 : పలమనేరు నియోజకవర్గ ఎమ్మెల్యే పదవికోసం బరిలో మిగిలిన 14 మందిలో ఆరుగురు వి.కోట మండల వాసులే కావడం విశేషం. ఈ మండ లానికి చెందిన తోటకనుమ గ్రామం నుంచి వైసీపీ అభ్యర్థిగా ఎం.వెంకటేగౌడు, వి.కోట హరిజన వాడకుచెందిన ఆర్.శోభ బీఎస్పీ పార్టీ తరఫున, ఎర్రంపల్లికి చెందిన సీ.వినోద్‌కుమార్ వీసీకే పార్టీ తరఫున, తుపాకి చిన్నే పల్లికి చెందిన ఆర్.అమరనాథరెడ్డి స్వతంత్ర అభ్యర్థిగా, వి.కోట పత్రపల్లి క్రాస్ వద్ద నివాస మున్న ఎల్.దామోదరనాయుడు ఇండిపెం డెం టుగా, శివునికుప్పం గ్రామానికి చెందిన వి.పవిత్ర కావలి స్వతంత్ర అభ్యర్థిగా పోటీచేస్తున్నారు.

ముగ్గురు అమరనాథరెడ్లు పోటీ..

ఈసారి అమరనాథరెడ్డి పేరుతో గల ముగ్గురు పోటీలో నిలిచారు. ఇందులో టీడీపీ అభ్యర్థి అమరనాథరెడ్డి ఒకరు కాగా వి.కోట మండలం తుపాకి చిన్నేపల్లి గ్రామానికి చెందిన ఆర్.అమరనాథరెడ్డి, బైరెడ్డిపల్లి మండలం చిన్నచెల్లారగుంట గ్రామానికి చెందిన అమరనాథరెడ్డి స్వతంత్ర అభ్యర్థులుగా నిలిచారు.

ముగ్గురు స్థానికేతరులు..

మొత్తం 14 మంది ఎన్నికల బరిలో మిగిలారు. ఇందులో పెద్దపంజాణి, గంగవరం, బైరెడ్డిపల్లి, పలమనేరు, వి.కోట మండలాలకు చెందిన వారు 11 మంది కాగా ముగ్గురు స్థానికేతరులు ఉన్నారు. నిమ్మనపల్లి మండలం తవలం గ్రామానికి చెందిన బొమ్మనపల్లి లక్ష్మణ్ణ, రామకుప్పం మండలం మిట్టపల్లి గ్రామానికి చెందిన సి.ఉమామహేశ్వరరెడ్డి, పుంగనూరు మండలం అలసాపురం గ్రామానికి చెందిన అలాసాపురం సుబ్రమణ్యం స్వతంత్రులుగా పోటీ చేస్తున్నారు.

ఇద్దరు మహిళలు

ఎమ్మెల్యే పదవికి పోటీలో ఉన్న 14 మందిలో ఇద్దరు మహిళలు ఉన్నారు. వి.కోట హరిజన వాడకు చెందిన ఆర్.శోభ బీఎస్పీ తరఫున, ఇదే మండలం శివునికుప్పం గ్రామానికి చెందిన వి.పవిత్రకావలి స్వతంత్ర అభ్యర్థిగా పోటీచేస్తున్నారు.

వేసవి శిక్షణను సద్వినియోగం చేసుకోండి

పుంగనూరు, ఏప్రిల్ 30: భగవాన్ సత్య సాయిబాబా తల్లి ఈశ్వరమ్మ వర్ధంతి సందర్భంగా బాలవికాస్ వేసవి శిక్షణా తరగతులను బాలబాలికలు సద్వినియోగం చేసుకోవాలని జిల్లా సత్యసాయిసేవా ఆర్గనైజేషన్ అధ్యక్షుడు ఎస్.మధుసూదనం కోరారు. మంగళవారం స్థానిక కొత్తయిండ్లు షిరిడి సాయిబాబా మందిరంలో వేసవి శిక్షణా తరగతులను ఆయన ప్రారంభించారు. వివరాలకు 8317670025లో సంప్రదించాలని కోరారు.

వచ్చారు.. వెళ్లారు!

● అదీ వేళ్లమీద లెక్కపెట్టినంతమందే
● తూతూ మంత్రంగా కుప్పం మండల మీట్



హాజరైన ప్రజాప్రతినిధులు (ఫోటోలో కుడివైపు వారు)

కుప్పం, ఏప్రిల్ 30: ఒకపక్క ఎండలు మండిపోతున్నాయి. భూగర్భ జలాలు అడుగంటి జనం గొంతులు ఎండుతున్నాయి. అయినా వారికి పట్టలేదు. ప్రజా సమస్యలపై పట్టింపు అసలే లేదు. అతికొద్దిమంది వచ్చామంటే వచ్చారు. ఉన్నామంటే ఉన్నారు. నోరు ఎత్తకుండానే సమావేశాన్ని అర్ధగంటలో ముగించేసి ఎక్కడివారక్కడ వెళ్లిపోయారు. తూతూ మంత్రంగా ముగిసిన కుప్పం మండల మీట్‌లో ప్రజాప్రతినిధుల తీరు ఇది. కుప్పం మండల పరిషత్తు సర్వసభ్య సమావేశం మంగళవారం ఉదయం పది గంటలకు జరుగుతుందని ముందుగానే అధికారులు ప్రకటించారు. కానీ సమావేశ ప్రారంభ సమయానికి కనీసం ఒకరిద్దరు సర్పంచిలు కూడా సమావేశపు హాలులో కనిపించలేదు. ఆపైన సైతం అతికొద్ది మంది హాజరయ్యారు. మండలంలో మొత్తం 31 గ్రామ పంచాయతీలు ఉన్నాయి. సర్పంచులు అంతేమంది హాజరు కావాలి. వీరితోపాటు ఎంపీటీసీ సభ్యులు కూడా రావాలి. కానీ సమావేశంలో ముందు భాగాన ఉన్న పది నుంచి పన్నెండు కుర్చీలు మాత్రమే నిండాయి. అధికారులు మాత్రం కాస్త ఎక్కువ సంఖ్యలోనే హాజరయ్యారు. ప్రజాప్రతినిధుల్లోనే సమావేశమంటే పూర్తి నిరాసక్తత కనిపించింది. కోరం ఉందో లేదో కూడా తెలియని స్థితిలోనే సమావేశం ప్రారంభమై ముగిసిపోయింది. ప్రజాప్రతినిధుల సంతకాలు మాత్రం కోరానికి సరపడా రిజిస్టర్‌లో చోటు చేసుకున్నాయట. ఎంపీపీ అశ్విని, ఎంపీడీవో ఖాదర్‌బాషాలు వేదిక మీద కూర్చున్నారు. వేసవిలో తాగునీటి ఎద్దడి లేకుండా చర్యలు తీసుకోవాలని ఎంపీపీ అధికారులను కోరారు. అంతేగానీ, మండుతున్న ఎండల్లో తగ్గిపోయిన భూగర్భ జలాలు, తాగునీటి సమస్య గురించి ప్రజాప్రతినిధులనుంచి ఒక్కటంటే ఒక్క మాట కూడా పలికిన వారు లేకుండా పోయారు.

భక్తిశ్రద్ధలతో సర్పదోష నివారణ పూజలు

రామకుప్పం: పట్టణ శివార్లలోని వళ్లీదేవసేన సమేత సుబ్రహ్మణ్యస్వామి ఆలయంలో మంగళవారం సర్పదోష నివారణ పూజలు జరిగాయి. పెద్దసంఖ్యలో భక్తులు తరలివచ్చి, స్వామివారిని దర్శించుకున్నారు. పలువురు భక్తులు స్వామివారి దర్శనానికి ముందు సర్పదోష నివారణ పూజల్లో పాల్గొన్నారు. ఆలయ పురోహితులు నాగరాజశర్మ, కృష్ణమూర్తి, బాలజీలు భక్తులచే సర్పదోష నివారణ పూజలు చేయించారు. భక్తులకు అన్నప్రసాదాలు, మజ్జిగ పంపిణీ చేశారు.

సాహితీ ప్రపంచంపై శ్రీశ్రీ చెరగని సంతకం



శ్రీశ్రీ రచనలను విద్యార్థులకు వివరిస్తున్న ప్రిన్సిపాల్ డాక్టర్ వెంకటేసులు

పలమనేరు, ఏప్రిల్30 : తెలుగుసాహితీ ప్రపంచంపై శ్రీశ్రీ చెరగనం సంతకం చేశారని పలమనేరు ప్రభుత్వ డిగ్రీకళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ వెంకటేసులు పేర్కొన్నారు. మంగళవారం శ్రీశ్రీ జయంతిని కళాశాల తెలుగు విభాగం ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. బడుగు, బలహీన వర్గాల పక్షాన నిలిచి ఆయన విప్లవ కవిగా, అరసం అధ్యక్షుడిగా, సినీ రచయితగా ఎన్నో రచనలు చేసి తెలుగు సాహితీ ప్రపం చంపై ఆయన తనదైన ముద్ర వేశారన్నారు. తెలుగు విభాగాధిపతి డాక్టర్ వాసు మాట్లాడుతూ శ్రీశ్రీ మరణించి నాలుగు దశాబ్దాలు గడిచి పోయినా ఆయన నేటికీ ప్రజల గుండెల్లో చిరస్థాయిగా నిలిచిపోయారన్నారు. తెలుగు అధ్యాపకురాలు సజని, డాక్టర్ నందీశ్వరయ్య, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

గంగవరం: మహాకవి శ్రీశ్రీ జయంతి సందర్భంగా స్థానిక కళామందిరంలో ఆయన చిత్రపటాన్ని ఏర్పాటు చేసి ఘనంగా నివాళులర్పించారు. తెలుగుసాహిత్య సాంస్కృతిక సమితి అధ్యక్షులు తులసీనాథం నాయుడు, మాధవరెడ్డి, జొన్నవిత్తుల శ్రీరామచంద్రమూర్తి, సంస్థ కార్యదర్శి పుష్ప, చంద్రశేఖరయ్య, హర్షిత తదితరులు పాల్గొన్నారు.

బాలకృష్ణకు ఘనంగా వీడ్కోలు



బాలకృష్ణకు వీడ్కోలు పలుకుతున్న టీడీపీ నేతలు

చిత్తూరు సిటీ, ఏప్రిల్ 30: టీడీపీ పొలిట్ బ్యూరో సభ్యుడు, హిందూపురం ఎమ్మెల్యే నందమూరి బాలకృష్ణకు టీడీపీ, బీజేపీ, జనసేన నేతలు మంగళవారం ఘనంగా వీడ్కోలు పలికారు. 'స్వర్ణాంధ్ర సాకార యాత్ర'లో భాగంగా సోమవారం చిత్తూరులో భారీ బహిరంగ సభ నిర్వహించిన విషయం తెలిసిందే. కాగా సోమవారం రాత్రి నగరంలోని బంగారుపాళ్యం టీడీపీ మండలాధ్యక్షుడు ఎన్‌పీ జయప్రకాష్‌కు చెందిన ఎన్‌సీఎస్ భాస్కర హోటల్‌లో విడిది చేశారు. మంగళవారం ఉదయం 5 గంటల నుంచే బాలకృష్ణ అభిమానులు ఎన్‌సీఎస్ భాస్కర హోటల్ వద్దకు చేరుకున్నారు. ఆయనతో సెల్ఫీలు తీసుకునేందుకు, కరచాలనం చేసేందుకు ఎగబడ్డారు. అనంతరం అపోలో మెడికల్ కాలేజి ఆవరణ లోని హెలిపాడ్ నుంచి బయలు దేరి ఒంగోలుకు వెళ్లారు. బాలకృష్ణకు వీడ్కోలు పలికిన వారిలో మాజీ ఎమ్మెల్సీ దొరబాబు, టీడీపీ ఉమ్మడి ఎమ్మెల్యే అభ్యర్థి గురజాల జగన్మోహన్, ఎంపీ అభ్యర్థి దగ్గుమళ్ళ ప్రసాద రావు, నేతలు కాజూరు బాలాజి, గోళ్ళ హేమాద్రినాయుడు ఉన్నారు.

చంద్రబాబుతోనే భవిష్యత్తు



కొత్తపేటలో ప్రచారం చేస్తున్న ఎమ్మెల్సీ కంచర్ల, రాజ్‌కుమార్

కుప్పం, ఏప్రిల్ 30: చంద్రబాబుతోనే రాష్ట్ర ప్రజల భవిష్యత్తు ముడిపడి ఉందని ఎమ్మెల్సీ కంచర్ల శ్రీకాంత్, టీడీపీ కుప్పం మున్సిపల్ అధ్యక్షుడు రాజ్‌కుమార్ అన్నారు. 'గతం గుర్తు చేసుకుందాం - బాబు రుణం తీర్చుకుందాం' కార్యక్రమంలో భాగంగా కుప్పం పురపాలక సంఘం 15వ వార్డు పరిధిలోని కొత్త పేట కూర్మాయిపురంలో మంగళవారం ఇంటింటి ప్రచారం నిర్వహించారు. సూపర్ సిక్స్ పథకాలను వివరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ చంద్రబాబు తిరిగి ముఖ్యమంత్రి అయితే నిరుద్యోగ యువతకు ఉపాధి లభిస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు అప్పు ముఖేశ్, కన్నన్, సత్యేంద్రశేఖర్, గోపీనాథ్, డాక్టర్ వెంకటేశ్, మంజునాథ్, సోము, సురేశ్, ఆర్ఆర్.రవి పాల్గొన్నారు.

అభివృద్ధి కోసం టీడీపీని ఆదరించాలి



బైపరెడ్లపల్లెలో ప్రచారం చేస్తున్న నాయకులు

రామకుప్పం, ఏప్రిల్ 30: గ్రామసీమలు అభివృద్ధి మార్గంలో పయనించాలంటే ప్రతి ఒక్కరూ టీడీపీని ఆదరించాలని ఆ పార్టీ ఎస్సీసెల్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు మునస్వామి, బీసీసెల్ కార్యనిర్వాహక కార్యదర్శి పత్ర నారాయణాచారి, తెలుగురైతు నియోజకవర్గ అధ్యక్షుడు చలపతి, పార్టీ మండల అధ్యక్ష, ప్రధానకార్యదర్శులు ఆనందరెడ్డి, నరసింహులు, మాజీ ఎంపీపీ అంజినేయరెడ్డి, మాజీ వైస్ఎంపీపీ చిన్నికృష్ణలు ఓటర్లను కోరారు. మంగళవారం బైపరెడ్లపల్లె, ఉన్సిగానిపల్లె పంచాయతీల్లో ప్రచారం చేశారు. చంద్రబాబును లక్షమెజారిటీతో గెలిపించాలని కోరారు. ఆయా కార్యక్రమాల్లో తెలుగుయువత మండల అధ్యక్షుడు విశ్వనాథ్, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

అభ్యర్థులకు గుర్తుల కేటాయింపు

కుప్పం, ఏప్రిల్ 30: కుప్పం నియోజకవర్గ ఎన్నికల బరిలో నామినేషన్ల ఉపసంహరణ ఘట్టం ముగిశాక మొత్తం 13 మంది అభ్యర్థులు పోటీలో మిగిలారు. వీరిలో తెలుగుదేశం పార్టీనుంచి నారా చంద్రబాబు నాయుడు, వైసీపీ నుంచి కేఆర్‌జే.భరత్, కాంగ్రెస్ పార్టీ నుంచి ఆవుల గోవిందరాజులు బరిలో ఉన్నారు. వీరుగాక వివిధ పార్టీలకు చెందిన అభ్యర్థులు 4, స్వతంత్ర అభ్యర్థులు ఆరుగురు పోటీలో ఉన్నారు. సోమవారం అర్ధరాత్రి పార్టీ అభ్యర్థులకు కేటాయించిన గుర్తులను ఎన్నికల అధికారులు అధికారికంగా విడుదల చేశారు.

ఏ పార్టీకి ఏ గుర్తు అంటే..

సి.గణేశ్ బీఎస్పీ (ఏనుగు), ఎ.గోవిందరాజులు, కాంగ్రెస్ (హస్తం) నారా చంద్రబాబు నాయుడు, టీడీపీ (సైకిల్), కేఆర్‌జే.భరత్ వైసీపీ (సీలింగ్ ఫ్యాన్), అక్బర్ భారతీయ ప్రజాగళ కళ్యాణ పక్ష (ద్రాక్ష), గోవిందప్ప, విడుతలై చిరుతైగల్ కట్చి (కుండ), డి.ప్రసాద్, పిరమిడ్ పార్టీ ఆఫ్ ఇండియా(టెలివిజన్) టి.తిమ్మరాయప్ప స్వతంత్ర అభ్యర్థి (రోడ్ రోలర్), యస్.నాగరాజు స్వతంత్ర (ఫ్రైయింగ్ పాన్), నీల జగదీశ్ స్వతంత్ర అభ్యర్థి(గాజు గ్లాసు), కె.ప్రకాశ్ స్వతంత్ర అభ్యర్థి (బ్యాటరీ టార్చి), బి.మురళీధర్ స్వతంత్ర అభ్యర్థి (లోలకం), సురేంద్రకుమార్ స్వతంత్ర అభ్యర్థి (సితార) గుర్తులను కేటాయించారు.

బీఎల్వోలు జాగ్రత్తగా వ్యవహరించాలి

సోమల, ఏప్రిల్ 30: సార్వత్రిక ఎన్నికలకు సంబంధించి బీఎల్వోలు జాగ్రత్తగా విధులు నిర్వహించాలని తహసీల్దార్ నాగరాజ తెలిపారు. మంగళవారం ఓటరు స్లిప్పులను బీఎల్వోలకు పంపిణీ చేశారు. స్లిప్పులను నేరుగా ఓటర్లకే అందజేయాలని సూచించారు. ఈ సమావేశంలో వీఆర్వోలు శ్రీజ, శివయ్య, వెంకటరమణ, సుబ్రమణ్యం, శ్రీనివాసులు పాల్గొన్నారు.

వైభవంగా గంగమ్మ జాతర



ప్రత్యేకాలంకారంలో నడివీధి గంగమ్మ

చౌడేపల్లె, ఏప్రిల్30: నడి వీధి గంగమ్మ జాతర మంగళవారం రాత్రి వైభవంగా ప్రాంభమైంది. స్థానిక చౌడేపల్లెలోని కుమ్మరి వీధిలోని కళ్యాణ గంగమ్మ ఆలయంలో నడివీధి గంగమ్మను పుట్టింటివారైన కుమ్మరి కులస్తులు అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించి ఊరేగింపుగా చాకలి వీధిలోని అత్తారిల్లు అయిన చాకలి కులస్తుల ఇంటికి వచ్చింది. అక్కడ చాకలి కులస్తులైన అమ్మవారి భక్తుడైన మడివిలి రాజుచే అమ్మవారికి శాస్త్రోక్తంగావివాహం నిర్వహించారు. అనంతరం మేళతాళాల నడుమ అమ్మవారు ఊరేగారు. నడివీధిలో అమ్మవారిని ప్రతిష్ఠింప చేశారు. బెస్తకులస్తులచే గట్టం కుండలు సమర్పించి భక్తులకు దర్శనం కల్పించారు.

సీఎంసీలో ఉచిత టీబీ పరీక్షలు

గుడిపాల, ఏప్రిల్ 30: 190 రామాపురం వద్ద ఉన్న సీఎంసీ ఆస్పత్రిలో ఉచితంగా టీబీ పరీక్షలు నిర్వహించి మందులను పంపిణీ చేస్తామని అడిషనల్ డీఎంఅండ్‌హెచ్‌వో వెంకటప్రసాద్ అన్నారు, ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

బాలకృష్ణకు ఘనంగా వీడ్కోలు



బాలకృష్ణకు వీడ్కోలు పలుకుతున్న టీడీపీ నేతలు

చిత్తూరు సిటీ, ఏప్రిల్ 30: టీడీపీ పొలిట్ బ్యూరో సభ్యుడు, హిందూపురం ఎమ్మెల్యే నందమూరి బాలకృష్ణకు టీడీపీ, బీజేపీ, జనసేన నేతలు మంగళవారం ఘనంగా వీడ్కోలు పలికారు. 'స్వర్ణాంధ్ర సాకార యాత్ర'లో భాగంగా సోమవారం చిత్తూరులో భారీ బహిరంగ సభ నిర్వహించిన విషయం తెలిసిందే. కాగా సోమవారం రాత్రి నగరంలోని బంగారుపాళ్యం టీడీపీ మండలాధ్యక్షుడు ఎన్‌పీ జయప్రకాష్‌కు చెందిన ఎన్‌సీఎస్ భాస్కర హోటల్‌లో విడిది చేశారు. మంగళవారం ఉదయం 5 గంటల నుంచే బాలకృష్ణ అభిమానులు ఎన్‌సీఎస్ భాస్కర హోటల్ వద్దకు చేరుకున్నారు. ఆయనతో సెల్ఫీలు తీసుకునేందుకు, కరచాలనం చేసేందుకు ఎగబడ్డారు. అనంతరం అపోలో మెడికల్ కాలేజి ఆవరణ లోని హెలిపాడ్ నుంచి బయలు దేరి ఒంగోలుకు వెళ్ళారు. బాలకృష్ణకు వీడ్కోలు పలికిన వారిలో మాజీ ఎమ్మెల్సీ దొరబాబు, టీడీపీ ఉమ్మడి ఎమ్మెల్యే అభ్యర్థి గురజాల జగన్మోహన్, ఎంపీ అభ్యర్థి దగ్గుమళ్ళ ప్రసాద రావు, నేతలు కాజూరు బాలాజి, గోళ్ళ హేమాద్రినాయుడు ఉన్నారు.

మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం : టీడీపీ



మొగరాలపల్లెలో టీడీపీ అభ్యర్థి గురజాల జగన్మోహన్, కేంద్ర మాజీ మంత్రి పనబాక లక్ష్మి, మాజీ ఎమ్మెల్యే గాంధీలకు స్వాగతం

గుడిపాల, ఏప్రిల్ 30: టీడీపీ అధికారంలోకి రాగానే మహిళలకు ఉచిత బస్సు సౌకర్యాన్ని కల్పిస్తామని చిత్తూరు టీడీపీ అభ్యర్థి గురజాల జగన్మోహన్ నాయుడు, కేంద్ర మాజీ మంత్రి పనబాక లక్ష్మి, మాజీ ఎమ్మెల్యే గాంధీ అన్నారు. మంగళవారం మండలంలోని మొగరాలపల్లె, చీలాపల్లె పంచాయతీల్లో ఎన్నికల ప్రచారాన్ని మండల టీడీపీ అధ్యక్షుడు సుబ్రహ్మణ్యం నాయుడు ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వృద్ధులకు రూ. 4వేలు, వికలాంగులకు రూ. 6వేలు పింఛన్, ఏడాదికి మూడు ఉచిత సిలిండర్లు, వలంటీర్లకు రూ. 10వేలు వేతనం, రైతులకు రూ. 20వేలు చొప్పున అందిస్తామన్నారు. కార్యక్రమంలో టీడీపీ ఎస్సీసెల్ ఉపాధ్యక్షుడు పీటర్, మాజీ జడ్పీటీసీ బాలాజీ నాయుడు, నేతలు హరినాయుడు, బీమా, నాగరాజయాదవ్, ప్రతాప్‌నాయుడు, రవినాయుడు, రవి తదితరులు పాల్గొన్నారు.

కూటమి గెలుపుతోనే మండల అభివృద్ధి సాధ్యం

చిత్తూరు రూరల్ : కూటమి అసెంబ్లీ అభ్యర్థి గురజాల జగన్మోహన్, ఎంపీ అభ్యర్థి ప్రసాద్‌రావు గెలుపుతోనే మండల అభివృద్ధి సాధ్యమవుతుందని టీడీపీ సీనియర్ నాయకుడు చంద్రప్రకాష్ అన్నారు. మంగళవారం చిత్తూరు రూరల్ మండలం బీఎన్ఆర్ పేట, అనంతాపురం, కుర్చివేడు, అనంతాపురం హరిజనవాడలో పర్యటించారు. సూపర్ సిక్స్ పథకాల గురించి ఓటర్లకు వివరించారు. కార్యక్రమంలో నాయకులు జయచంద్రనాయుడు, శశికర్‌బాబు, రఘు, మోహన్‌రాజ్, నీలకంఠనాయుడు, దేవరాజులు నాయుడు, మనోహర్‌నాయుడు, శీన తదితరులు పాల్గొన్నారు.

ప్రజల సంక్షేమమే టీడీపీ లక్ష్యం

చిత్తూరు సిటీ : ప్రజల సంక్షేమమే టీడీపీ లక్ష్యమని మాజీ మేయర్ కటారి హేమలత, గురజాల ప్రతిమ అన్నారు. మంగళవారం నగరంలోని 33, 34, 49 డివిజన్ల పరిధిలోని గంగనపల్లి, కమ్మనాయుడు కాలని, సంతపేట తదితర ప్రాంతాల్లో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సూపర్ సిక్స్ పథకాల ద్వారా రాష్ట్రంలోని మహిళలందరికీ లబ్ధి కలుగుతుందని అన్నారు. మహిళలు ఆర్థికంగా ఎదగాలన్నా, మహిళలకు రక్షణ కావాలన్నా ఉమ్మడి ప్రభుత్వం రావాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. అనంతరం ఇంటింటికి వెళ్ళి సూపర్ సిక్స్ పథకాలను వివరించారు. ఎమ్మెల్యే అభ్యర్థి గురజాల జగన్మోహన్, ఎంపీ అభ్యర్థి దగ్గుమళ్ళ ప్రసాదరావులను అత్యధిక మెజారిటీతో గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో మాజీ కార్పోరేటర్‌లు వరదరాజులు, కంద, కుప్పన్ నేతలు కటారి లావణ్య, గోపి, కిషోర్, గిరి దేవా, జాని, దేవేంద్ర, అనిల్ తదితరులు పాల్గొన్నారు. గిరింపేటలో దుర్గమ్మగుడి మాజీ ఛైర్మన్ విశ్వనాథ్, నగర మహిళాఅధ్యక్షురాలు వరలక్ష్మి, జయరాజ్ తదితరులు ప్రచారం నిర్వహించారు.

శేష జీవితం ఆనందంగా గడపాలి : ఎస్పీ



పదవీ విరమణ పొందిన వారిని సన్మానిస్తున్న ఎస్పీ

చిత్తూరు, ఏప్రిల్ 30: సుదీర్ఘకాలం క్రమశిక్షణతో బాధ్యతాయుతంగా విధులు నిర్వహించి పదవీ విరమణ పొందిన వారంతా శేష జీవితాన్ని ఆనందంగా గడపాలని ఎస్పీ మణికంఠ కోరారు. పదవీ విరమణ పొందిన ఏఎస్ఐలు ఏజీ వడివేలు, జ్ఞానప్రకాష్, ఏఆర్ఎస్ఐ రమేష్, ఏఆర్ హెడ్‌కానిస్టేబుల్ రామచంద్రలకు మంగళవారం పోలీసు అతిథి గృహంలో సన్మానసభ నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన ఎస్పీ మాట్లాడుతూ పదవీ విరమణ పొందిన వారికి ఎలాంటి అవసరం వచ్చినా నేరుగా కలిసి సమస్యను తెలపాలన్నారు. అనంతరం పదవీ విరమణ పొందిన వారిని శాలువాలు, మెమెంటోలతో సన్మానించారు. కార్యక్రమంలో ఏఎస్పీ అరీఫుల్లా, డీఎస్పీ రాజగోపాల్‌రెడ్డి, ఏఆర్ డీఎస్పీ మహబూబ్ బాష, ఆర్ఐ నీలకంటేశ్వర్‌రెడ్డి, ఎంటీవో భాస్కర్, పోలీసు అసోసియేషన్ అధ్యక్షులు ఉదయ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

బాధితులకు ఎస్పీ ఆర్థిక సాయం

చిత్తూరు, ఏప్రిల్ 30: విధి నిర్వహణలో ప్రమాదానికి గురై ఇంటిలో విశ్రాంతి తీసుకుంటున్న కాణిపాకం స్టేషన్ కానిస్టేబుల్ నవీన్‌కుమార్ కుటుంబ సభ్యులకు ఎస్పీ మణికంఠ చందోలు ఐడీఆర్ఎఫ్ కింద ఆర్థిక సాయం చేశారు. మంగళవారం పోలీసు అతిథి గృహంలో జరిగిన కార్యక్రమంలో చెక్కును అందించారు. ● అలాగే హోంగార్డు యూనిట్‌లో విధులు నిర్వహిస్తూ అనారోగ్యంతో మృతి చెందిన హెడ్‌గార్డు పట్టాభి కుటుంబ సభ్యులకు ప్రభుత్వం ఆర్థికసాయాన్ని ప్రకటించింది. ఈ సాయాన్ని ఎస్పీ మణికంఠ చందోలు మృతుడి భార్య గీతకు రూ. 4 లక్షల చెక్కును అందించారు.

బేల్దార్ హత్య కేసులో నిందితుడి అరెస్టు

చిత్తూరు, ఏప్రిల్ 30: కేరళకు చెందిన బేల్దార్ ఆసీఫ్‌ను హత్య చేసిన నిందితుల్లో మరో నిందితుడ్ని పోలీసులు పట్టుకున్నారు. వారం రోజుల కిందట కేరళకు చెదిన ఆసీఫ్, పవన్, బద్రిలు కలిసి మద్యం సేవించారు. ఆ సమయంలో సెల్‌ఫోన్ కారణంగా గొడవ తలెత్తింది. ఈ ఘర్షణలో ఆసీఫ్‌ను పవన్, బద్రిలు కలిసి తోటపాళ్యంలో బీర్‌బాటిల్‌తో కొట్టి చంపేశారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసిన రెండో పట్టణ సీఐ ఉలసయ్య రెండు రోజుల కిందట పవన్‌ను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. నిందితుల్లో మరో వ్యక్తి బద్రి హత్య చేసిన రోజునే తిరుమలకు వెళ్లి తలదాచుకున్నాడు. మంగళవారం భార్యాబిడ్డల్ని చూడటానికి సంతపేటకు రావడంతో పోలీసుల పట్టుకున్నారు. ఈ మేరకు బద్రిని రిమాండ్‌కు పంపినట్లు సీఐ తెలిపారు.

కాంగ్రెస్ పార్టీ విజయానికి సహకరించండి

బంగారుపాళ్యం, ఏప్రిల్ 30: రాబోవు ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ విజయానికి సహకరించాలని వైసీపీ సీనియర్ నాయకులతో ఎమ్మెల్యే ఎంఎస్ బాబు కోరారు. మంగళవారం ఆయన తుంబకుప్పంలోని సీనియర్ నాయకుడు విద్యారెడ్డి, మాజీ ఎంపీపీ సుగుణాకర్ రెడ్డిలను వారి స్వగృహంలో కలిశారు. ఈ సందర్భంగా వారితో ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీకి సహకరించాలని మర్యాదపూర్వకంగా కలిసి కోరారు.

కారు డ్రైవర్‌కు పదేళ్ల జైలు శిక్ష

చిత్తూరు లీగల్, ఏప్రిల్ 30: అజాగ్రత్తగా కారు నడిపి ఓ మహిళ మృతికి కారకుడైన డ్రైవర్‌కు చిత్తూరు కోర్టు పదేళ్ల జైలు శిక్ష, జరిమానా విధించింది. యాదమరికి చెందిన రెడ్డినాగలక్ష్మి, జ్ఞాన సుధ 2019 ఫిబ్రవరి 12న చిత్తూరులోని బంధువుల నుంచి ఇంటికి వెళ్లేందుకు గిరింపేటలోని చౌడేశ్వరమ్మ ఆలయం వద్ద నడిచి వెళుతుండగా కారు ఢీకొంది. తీవ్రంగా గాయపడిన వీరిద్దరిని చిత్తూరు ప్రభుత్వాస్పత్రికి తరలించగా రెడ్డినాగలక్ష్మి మృతి చెందింది. ఈ మేరకు ట్రాఫిక్ పోలీసులు ఇరువారానికి చెందిన రూబెన్‌పై కేసు నమోదు చేశారు. ఈ కేసు చిత్తూరులోని 8వ అదనపు జిల్లా కోర్టులో మంగళవారం వాయిదా ఉండగా పూర్వపరాలు పరిశీలించిన న్యాయమూర్తి శ్రీదేవి రూబెన్‌పై నేరం రుజువుకావడంతో పదేళ్ల జైలు శిక్ష, వెయ్యి రూపాయలు జరిమాన విధిస్తూ తీర్పు చెప్పారు. ఈ కేసును పీపీ రవీంద్రనాథ రెడ్డి వాదించారు.

నేడు వాహనాల వేలం

చిత్తూరు సిటీ, ఏప్రిల్ 30: ఎక్సైజ్ దాడుల్లో పట్టుబడిన వాహనాలను వేలం వేయనున్నట్లు ఎక్సైజ్ అర్బన్ సీఐ విజయకుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. ఆసక్తి గలవారు బుధవారం ఉదయం జిల్లా కోర్టు సమీపంలోని అర్బన్ ఎక్సైజ్ స్టేషన్‌లో సంప్రదించాలన్నారు. వేలంలో పాల్గొనేవారు రూ.5 వేలు డిపాజిట్ చెల్లించి వేలం పాటలో పాల్గొనాలని ఆయన ఆప్రకటనలో తెలిపారు.

'మభ్యపెట్టి వైసీపీ కండువా కప్పారు'

నింద్ర, ఏప్రిల్ 30: గ్రామాల్లో ఉన్న యువతను, నాయకులను మభ్యపెట్టి వారికి వైసీపీ కండువా కప్పి పార్టీలో చేరినట్లు పత్రికలో ప్రకటించినట్లు మాజీ జడ్పీటీసీ మాలతి, టీడీపీ నాయకుడు చిట్టిబాబు ఎద్దేవా చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కొత్త ఆరూరుకు చెందిన టీడీపీ యువతకు పాత ఆరూరుకు చెందిన వైసీపీ నేత వేణుగోపాల్, మరికొందరు నాయకులు క్రికెట్ కిట్లు ఇప్పిస్తామని యువతను తీసుకెళ్లి వైసీపీ కండువా కప్పి పంపించారని ఆరోపించారు. తమకు పార్టీ కండువా కప్పుతారనే విషయం మంత్రి రోజా కార్యాలయం వద్దకు వెళ్లే వరకు తెలియదన్నారు. తాము టీడీపీకి మాత్రమే మద్దతు తెలుపుతామని స్పష్టం చేశారు.

చిత్తూరు మార్కెట్‌లో కుప్పలుగా చెత్త





చిత్తూరు, ఏప్రిల్ 30: ఎన్నికలను కారణంగా చూపి చిత్తూరు నగరపాలక సంస్థ సిబ్బంది పారిశుధ్యాన్ని గాలికొదిలేసింది. పట్టించుకోవాల్సిన అధికారులు ఎన్నికల విధుల్లో ఉన్నామంటూ తిరుగుతుండటంతో వీధులు, మార్కెట్ల వద్ద చెత్త చిన్నపాటి డంపింగ్‌యార్డును తలపిస్తోంది. స్థానిక కొంగారెడ్డిపల్లె పూలమార్కెట్ వద్ద వారంరోజులుగా చెత్తను తీయకపోవడంతో చెత్తంతా మార్కెట్‌లో కుప్పలుగా చేరింది. గాలితోపాటు ఆవులు, కుక్కలు చిందరవందర చేస్తున్నాయి. పట్టించుకోవాల్సిన పారిశుధ్య సిబ్బంది పట్టించుకోలేదు. ఇప్పటికైనా పారిశుధ్య అధికారులు స్పందించి చెత్తను తొలగించాలని వ్యాపారులు, స్థానికులు కోరుతున్నారు.

పోలింగ్ కేంద్రాల పరిశీలన

చిత్తూరు, ఏప్రిల్ 30: చిత్తూరు నగరంలోని సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలను చిత్తూరు పార్లమెంటు నియోజకవర్గ వ్యయ పరిశీలకుడు ప్రసాద్ శర్మ పరిశీలించారు. మంగళవారం ఆయన కట్టమంచి పాఠశాల, శర్మన్ పాఠశాల, పీసీఆర్ కళాశాలలోని 18, 19, 20, 66, 67, 68, 50, 26, 45, 47 పోలింగ్ కేంద్రాలను పరిశీలించారు. పోలింగ్ కేంద్రాల పరిధిలో చేపట్టిన ఏర్పాట్లను తనిఖీ చేశారు. పోలింగ్ కేంద్రాల వారీగా చేపట్టిన ఏర్పాట్లను, రూట్ మ్యాప్‌లను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో ఎంఈ గోమతి, ఎంహెచ్‌వో అనిల్‌కుమార్ నాయక్, డీఈలు, ఏఈలు, శానిటరీ ఇన్స్‌పెక్టర్లు పాల్గొన్నారు.

ద్రౌపది విగ్రహ ఊరేగింపు



పాలసముద్రం, ఏప్రిల్ 30: మండలంలోని అత్తిమంజేరిలో జరుగుతున్న మహాభారతం తిరుణాళ్ళలో భాగంగా మంగళవారం అమ్మవారి విగ్రహాలను వనదుర్గాపురం, ఎగువ వనదుర్గాపురం, అత్తిమంజేరి గ్రామాల్లో ఊరేగించారు. అమ్మవారి విగ్రహానికి ప్రజలు కర్పూర హారతులిచ్చి మొక్కులు తీర్చుకున్నారు.

వేణుగోపాలస్వామి ఊరేగింపు

కార్వేటినగరం, ఏప్రిల్ 30: కార్వేటి నగరంలోని టీటీడీ వేణుగోపాలస్వామి ఆలయంలో ఉత్స వాల్లో భాగంగా రెండవ రోజు స్వామి వారిని పుర వీధుల్లో ఊరేగిం చారు. భక్తులు స్వామివారికి కర్పూర హారతి నీరజనాలు అర్పించారు.

అయ్యప్పరాజుకండ్రిగలో వర్షం కోసం పూజలు

పాలసముద్రం, ఏప్రిల్ 30: మండలంలోని శ్రీకావేరిరాజుపురం పంచాయతీ, అయ్యప్పరాజు కండ్రిగలో ఉన్న విరూపాక్షమ్మ ఆలయంలో మంగళవారం వర్షం కురవాలని ప్రజలు పూజలు నిర్వహించారు. ఉదయం అంబళ్ళు పోసి, అమ్మవారికి జంతుబలి ఇచ్చి పూజలు చేశారు. సాయంత్రం అమ్మవారి చిత్రపటాన్ని ఊరేగించారు. మంచి వర్షాలు కురిసి పంటలు సమృద్ధిగా పండాలని ప్రజలు మొక్కుకున్నారు.

నేడు శని సంక్రమణ పరిహార పూజలు

చిత్తూరు కల్చరల్, ఏప్రిల్ 30: గిరింపేట సీబీరోడ్డు దక్షిణామూర్తి ఆలయంలో బుధవారం శని త్రయోదశి సంక్రమణ పరహార పూజలు నిర్వహిస్తున్నట్లు ఆలయ నిర్వాహకులు ఒక ప్రకటనలో తెలిపారు. మేష, వృషభ, మిధున, మకర, వృశ్చిక, ధనస్సు, కర్కాటక, తులా రాశి వారికి మూడ మాసంలో శని సంక్రమణ సందర్భంగా ప్రత్యేక పరిహార పూజలు చేయనున్నామని వారు తెలిపారు.అదేవిధంగా గిరింపేట దుర్గాంబ ఆలయంలో ఈ రాశి వారికి నవగ్రహ శాంతిపూజలు, సంతపేట ఇందిరానగర్ దక్షిణామూర్తి ఆలయంలో శనిత్రయోదశి సంక్రమణ పరిహారపూజలు నిర్వహిస్తున్నట్లు తెలియజేశారు.

అక్రమ మద్యం స్వాధీనం

శ్రీరంగరాజపురం, ఏప్రిల్ 30: అక్రమ మద్యం స్వాధీనం చేసుకుని ఒకరిని అరెస్టు చేసిన ఘటన ఎస్ఆర్ పురం మండలంలో చోటుచేసుకుంది. పుల్లూరు గ్రామానికి చెందిన వెంకటేష్(41) మంగళవారం తన షాపు దగ్గర మద్యం బాటిల్ విక్రయిస్తుండగా పోలీసులు దాడి చేసి 14 క్వాటర్ బాటిల్ స్వాధీనం చేసుకుని, వెంకటేష్‌ను అరెస్టు చేసి కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ కుళాయిప్ప తెలిపారు.

పేదలకు అన్నదానం



బంగారుపాళ్యం, ఏప్రిల్ 30: బెంగుళూరుకు చెందిన రఘునాథ నాయుడు వర్ధంతి సందర్భంగా బీపీఎన్‌కే కాంప్లెక్స్ వద్ద మంగళవారం జరిగిన అన్నదాన కార్యక్రమానికి మండల టీడీపీ అధ్యక్షుడు ఎన్‌పీ జయప్రకాష్ భోజనం వితరణ చేశారు.

14న గంగజాతర చాటింపు

చిత్తూరు కల్చరల్, ఏప్రిల్ 30: చిత్తూరు నడివీధి గంగమ్మ జాతర ఈనెల 21, 22 తేదీల్లో నిర్వహించనున్నట్లు ఉత్సవ వంశ పారంపర్య ధర్మకర్తలు ఒక ప్రకటనలో తెలిపారు. కలెక్టర్ సూచన ప్రకారం ఈనెల 14న గంగజాతర చాటు నిర్వహించి 21, 22వ తేదీల్లో గంగజాతర నిర్వహించనున్నామని తెలిపారు

పవర్‌లూమ్స్‌కు ఉచిత విద్యుత్తు హర్షణీయం : భాను

పుత్తూరు అర్బన్, ఏప్రిల్ 30: పవర్‌లూమ్స్‌కు నెలకు 500 యూనిట్లు ఉచిత విద్యుత్తును ప్రకటిస్తూ ఎన్నికల మేనిఫెస్టోలో టీడీపీ అధినేత చంద్రబాబు, జనసేనాని పవన్‌కళ్యాణ్ ప్రకటించడం సంతోషంగా ఉందని కూటమి నగరి ఎమ్మెల్యే అభ్యర్థి గాలి భానుప్రకాష్ అన్నారు. మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ వైసీపీ అధికారంలోకి వచ్చాక పెంచిన విద్యుత్ చార్జీలతో పవర్‌లూమ్స్ రంగం కుదేలైందని ఆవేదన వ్యక్తం చేశారు. గత ఎన్నికల సమయంలో రోజా పవర్‌లూమ్స్‌కు ఉచిత విద్యుత్ అందిస్తామని హామీ ఇచ్చి విస్మరించిందని గుర్తు చేశారు. క్లస్టర్ ఇన్‌చార్జి గంజి మాధవయ్య, మాజీ ఎంపీపీ డీఎన్ ఏలుమలై (అమ్ములు), పట్టణ, రూరల్ పార్టీ అధ్యక్షులు గాలి జీవరత్నం నాయుడు, రవికుమార్, పట్టణ, రూరల్ పార్టీ ప్రధాన కార్యదర్శులు ఎన్ఎన్ ధనపాల్, బాలాజీ పాల్గొన్నారు.

అనాథ వృద్ధురాలికి అంత్యక్రియలు

బంగారుపాళ్యం, ఏప్రిల్ 30: మూడ్రోజుల క్రితం గుండ్లకట్టమంచి వద్ద గుర్తుతెలియని వాహనం ఢీకొని ఓ వృద్ధురాలు మృతిచెందిన ఘటన విధితమే. ఆమె మృతదేహాన్ని బంగారుపాళ్యం మార్చురీలో ఉంచి, బంధువుల కోసం ఎదురుచూశారు. ఎవరూ రాకపోవడంతో మంగళవారం బంగారుపాళ్యం ముస్లిం జేఏసీ సభ్యులు, ఏఎస్ఐ మల్లప్ప ఆధ్వర్యంలో తగ్గువారిపల్లె శ్మశానవాటికలో ఖననం చేశారు.

యువతకు ఉపాధి అవకాశాలు కల్పిస్తాం

పూతలపట్టు టీడీపీ అభ్యర్థి మురళీమోహన్



కాణిపాకంలో ప్రచారం నిర్వహిస్తున్న టీడీపీ అభ్యర్థి మురళీమోహన్

ఐరాల(కాణిపాకం), ఏప్రిల్ 30: పూతలపట్టు నియోజకవర్గంలోని యువతకు వారివారి విద్యార్హతలు బట్టి ఉద్యోగ అవకాశాలు కల్పిస్తామని టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి మురళీమోహన్ అన్నారు. కాణిపాకంలో మంగళవారం ఆయన పార్టీ నాయకులు, కార్యకర్తలతో కలసి ఇంటిఇంటికి వెళ్లి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జగన్ పాలనలో యువతకు ఆదరణ లేకుండా పోయిందన్నారు. ప్రతి తల్లిదండ్రులు ఈ విషయాన్ని ఆలోచించి ఈ ఎన్నికలలో టీడీపీ గుర్తు అయిన సైకిల్‌కు ఓటు వేసి గెలిపిస్తే యువతకు అవకాశాలు కల్పిస్తామన్నారు. నియోజకవర్గంలో సిల్క్‌డెవలప్‌మెంట్‌ను ఏర్పాటు చేస్తామన్నారు. యువత బాగుపడితే సమాజం బావుంటుందన్నారు. అంతే కాకుండా వైసీపీ పాలనలో కాణిపాకం ఏ అభివృద్ధికి నోచుకోకపోవడం దారుణం అన్నారు. టీడీపీ గద్దెనెక్కిన వెంటనే ప్రతి వర్గానికి న్యాయం చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో మండల టీడీపీ అధ్యక్షుడు గిరిధర్‌బాబు, నాయకులు మణినాయుడు, సందీప్, మధుసూదన్‌రావు, హేమాద్రినాయుడు, శ్రీధర్‌నాయుడు, గంగారపుహరిబాబునాయుడు, లత, కొల్లారమేష్,ధనశ్రీ, జగదీశ్వరనాయుడు తదితరులు పాల్గొన్నారు.

టీడీపీ అభ్యర్థులను గెలిపించండి

తవణంపల్లె : టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి మురళీమోహన్, ఎంపీ అభ్యర్థి దగ్గుమళ్ల ప్రసాద్‌రావులకు ఓటు వేసి గెలిపించాలని టీడీపీ నేతలు కోరారు. టీడీపీ నాయకులు మంగళవారం మండలంలోని జొన్నగురకల పంచాయతీ పరిధిలోని గ్రామాల్లో టీడీపీ సూపర్ సిక్స్ పథకాల కరపత్రాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో మండల టీడీపీ అధ్యక్షుడు గాలి దిలీప్‌కుమార్, రాష్ట్ర టీడీపీ కార్యదర్శి వెంకటేష్‌చౌదరి, అధికార ప్రతినిధి సప్తగిరి ప్రసాద్, మండల ప్రధాన కార్యదర్శి మధుకుమార్, నాయకులు మురళీకృష్ణ, షబ్బీర్ ఆలీప్రకాష్, స్వర్ణ, గిరిబాబు, బాబునాయుడు, జ్యోతి, తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రం బాగుపడాలంటే బాబు రావాలి : భీమనేని





వనదుర్గాపురంలో ప్రచారం నిర్వహిస్తున్న భీమనేని చిట్టిబాబు నాయుడు, లక్ష్మీరాజు పంచాయతీలో కరపత్రాలు పంచుతున్న టీడీపీ నాయకులు

పాలసముద్రం, ఏప్రిల్ 30: రాష్ట్రం బాగుపడాలంటే టీడీపీ జాతీయ అధ్యక్షుడు నారా చంద్రబాబు ముఖ్యమంత్రి కావాలని రాష్ట్ర టీడీపీ కార్యనిర్వాహక కార్యదర్శి భీమనేని చిట్టిబాబు నాయుడు అన్నారు. మంగళవారం మండలంలోని వనదుర్గాపురం పంచాయతీలోని వనదుర్గాపురం, వనదుర్గాపురం ఆదిఆంధ్రవాడ, దిగువ వనదుర్గాపురం, ఎగువ వనదుర్గాపురం, మిట్టయిండ్లు గ్రామాల్లో ఇంటింటికీ వెళ్ళి తెలుగుదేశం పార్టీ ప్రవేశపెట్టిన సూపర్‌సిక్స్ పథకాలపై అవగాహన కల్పించి, కరపత్రాలను పంపిణీ చేశారు. గంగాధరనెల్లూరు నియోజకవర్గం టీడీపీ అభ్యర్థి డాక్టర్ థామస్, చిత్తూరు పార్లమెంటు ఎంపీ అభ్యర్థి దగ్గుమళ్ళ ప్రసాదరావులను గెలిపించాలని ప్రజలను అభ్యర్థించారు. ఈ కార్యక్రమంలో చిత్తూరు పార్లమెంటు టీడీపీ కార్యదర్శి వాసు నాయుడు, మండల టీడీపీ ప్రధాన కార్యదర్శి శేఖర్‌రాజు, నాయకులు శీను రాజు, జె. విజయ్‌కుమార్, బాబు యాదవ్, వాసు, మోహన్‌రాజు, రవి నాయుడు తదితరులు పాల్గొన్నారు.

కార్వేటినగరం : లక్ష్మీరాజుపూట పంచాయతీలో బాబు ష్యూరిటీ భవిష్యత్తుకు గ్యారెంటీ కార్యక్రమం నిర్వహించారు. టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి డాక్టర్ థామస్‌ను గెలపించాలని ఓటర్లను కోరారు. మండల టీడీపీ అధ్యక్షుడు చెంగల్‌రాయల్ యాదవ్, నాయకులు రాజేందర్‌రెడ్డి, ఎం.జనార్ధన్‌రాజు, నాగేశ్వరాజు, కుమారస్వామిరాజు పాల్గొన్నారు.

పెనుమూరు : కూటమి అభ్యర్థులకు ఓటు వేసి గెలిపిస్తే రాష్ట్రం బాగుపడుతుందని మండల అధ్యక్షుడు రుద్రయ్యనాయుడు, జిల్లా యాదవ సాధికారసమితి అధ్యక్షులు శ్రీధర్‌యాదవ్ కోరారు. మంగళవారం మండలంలోని గుంటిపల్లిలో ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు ఇంటింటికి వెళ్లి సైకిల్ గుర్తుకు ఓటు వేయాలని కోరారు. కార్యక్రమంలో హరిబాబునాయుడు, మనోహర్‌రెడ్డి, కృష్ణమూర్తినాయుడు, పరమేశ్వర్‌రెడ్డి, తలారి రెడ్డెప్ప, సతీష్‌రెడ్డి, సురేష్‌నాయుడు, శ్రీనివాసులునాయుడు, బాలయ్య, అశోక్, ప్రసాద్‌యాదవ్, రమేష్‌రెడ్డి, చిరంజీవి యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

టీడీపీ గెలుపే లక్ష్యంగా పనిచేయండి : గాలి భాను



వైసీపీ నుంచి టీడీపీలో చేరుతున్న కుమార్

విజయపురం, ఏప్రిల్ 30: గెలుపే లక్ష్యంగా పనిచేయాలని నగరి టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి గాలి భానుప్రకాష్ పిలుపునిచ్చారు. మంగళవారం మండలంలోని విజయపురం దళితవాడ, మంగళం, క్షూరికాపురం, తెల్లగుంట, జగన్నాథపురం, పన్నూరు, పన్నూరు దళితవాడ ప్రాంతాలలో పర్యటించి టీడీపీని ఆదరించాలని కోరారు. క్షూరికాపురం ఆదిఆంధ్రవాడలో వైసీపీ కార్యకర్తలు సురేష్, మోహన్, చంద్రయ్య, అంకయ్య, మునస్వామి, ఆరుద్రయ్య, మునెయ్య, శంకర్, వినోద్, చెంగమ్మ, క్షూరికాపురం నుండి డిల్లీబాబు, మణి తదితరులు టీడీపీ తీర్థం పుచ్చుకున్నారు. ఆయన మాట్లాడుతూ వైసీపీ నాయకులు కొండలను, గుట్టలను మాయం చేశారని, ప్రకృతి వనరులను దోచేశారని ఆరోపించారు. నగరి పట్టణ పరిధిలోని 25వ వార్డులో టీకే కుమార్, నాల్గవ వార్డులో టి.శ్రీనివాసులు, శోభన్‌బాబు టీడీపీ తీర్థం పుచ్చుకున్నారు. కార్యక్రమంలో నాయ కులు గుణశేఖర్, బాలాజీ బాబురెడ్డి తదితరులు పాల్గొన్నారు. నగరి మండలం ఓజీకుప్పంలో మండల టీడీపీ అధ్యక్షుడు శివకుమార్ రెడ్డి, కార్యదర్శి పురుషోత్తం నాయుడు ఆధ్వర్యంలో ప్రచారం నిర్వహించారు. నాయకులు బాలాజీ, కుమార్ నాయుడు, సురేష్ నాయుడు, నారాయణ స్వామి నాయుడు, శ్రీనివాసులురెడ్డి, దేవా, మణి, బాబురెడ్డి తదితరులు పాల్గొన్నారు.

వడమాలపేట : ఎస్‌బీఆర్ పురంలో జిల్లా టీడీపీ ఉపాధ్యక్షుడు మణిరాజు ప్రచారం నిర్వహించారు. గాలి భాను ప్రకాష్ ను గెలిపించాలని కోరారు. టీడీపీ నాయకులు రవికుమార్, ధనంజయులు నాయుడు, సుబ్రమణ్యం యాదవ్, పెద్దబ్బరాజు, సుకుమార్, సూర్య, రమేష్, చిరంజీవి తదితరులు పాల్గొన్నారు.

అవ్వాతాతలకు ఇంటి వద్దనే పింఛన్ ఇవ్వాలి



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న టీడీపీ నేతలు

చిత్తూరు సిటీ, ఏప్రిల్ 30: మే ఒకటోతేది ఇవ్వాల్సిన పింఛన్‌లను ఇంటి వద్దనే ఇవ్వాలని టీడీపీ నేతలు డిమాండ్ చేశారు. మంగళవారం జిల్లా పార్టీ కార్యాలయంలో వారు మాట్లాడుతూ సీఎం జగన్ రాజకీయ లబ్ధి పొందడానికి అవ్వతాతల ప్రాణాలతో చెలగాటమాడుతున్నారని అన్నారు. కేంద్ర ఎన్నికల సంఘం పింఛన్‌ను వలంటీర్ల ద్వారా పంపిణీ చేయవద్దని మాత్రమే చెప్పిం దన్నారు. వైసీపీ ప్రభుత్వం కుట్ర, కుతంత్రాల వల్ల గత నెల పింఛన్ కోసం పడిగాపులు పడిన 36మంది మరణించారని, ఇది ముమ్మాటికి ప్రభుత్వ హత్యలేనని చెప్పారు. పంచాయితీ సెక్రటరీలు, వీఆర్వోలు, సచివాలయ సిబ్బంది, వెలుగు సిబ్బంది ద్వారా పింఛన్ ఇంటింటికీ పంపిణీ చేయలని విజ్ఞప్తి చేసినా బ్యాంకు ఖాతాల్లో జమ చేస్తామని చెప్పడం దురదృష్టకర మన్నారు. కార్యక్రమంలో పార్టీ రాష్ట్ర అధికార ప్రతినిధి సప్తగిరి ప్రసాద్, పార్టీ చిత్తూరు పార్లమెంటు ప్రధాన కార్యద్శి కోదండయాదవ్, నేతలు మోహన్‌రాజ్, ధరణి ప్రకాష్, గిరిబాబు, షబ్బీర్ బాషా, దామోదరం, మురళి పాల్గొన్నారు.

అధికారంలోకొస్తే గాలేరు-నగరి ప్రాజెక్టు పూర్తి చేస్తాం : కాంగ్రెస్



నగరిలో ప్రచారం చేస్తున్న కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి రాకేష్ రెడ్డి

నగరి, ఏప్రిల్ 30 : రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తే నగరి ప్రాంతవాసులకు అనువుగా గాలేరు-నగరి ప్రాజెక్టు పూర్తిచేసి సాగు, తాగునీరు అందిస్తామని నగరి కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థి రాకేష్‌రెడ్డి తెలిపారు. నగరి మండలం గుండ్రాజుకుప్పం, అడవికొత్తూరు, మిట్టపాళెం, మూలనత్తం, థెరణి, తడుకుపేట, వీకేఆర్‌పురం, గుడ్డికండ్రిగలలో మంగళవారం ఆయన ప్రచారం నిర్వహించారు. కాంగ్రెస్ పార్టీ మ్యానిఫెస్టోను ప్రజలకు వివరించారు. రాబోయే ఎన్నికలలో కాంగ్రెస్‌పార్టీ అభ్యర్థులను అత్యధిక మెజారిటీతో గెలి పించాలన్నారు. కార్యక్రమంలో మండల అధ్యక్షుడు కుమార్, పీసీసీ ప్రధాన కార్యదర్శి బాబు, డీసీసీ కార్యదర్శి డిల్లీ, దేశయ్య, చిరంజీవిరెడ్డి, రత్నం, లోహిత్ రాజు, రజనీదేశప్ప, దివాకర్, పలువురు నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.